ప్రజాశక్తి

సోపతి

ఫిబ్రవరి 22, 2015 ఆదివారం అనుబంధం

ఆమె కవిత్వం పార్శ్వాంశం

ఈ వనరులే ప్రత్యామ్నాయం

- భీమరాజు కథ : అమ్మచెబితే...
- మనసున మల్లెల మాలలూగించే సాహిత్యం
- సి.నా.రె, విల్సన్‌రావు కవితలు
- గ్రంథావలోకనంపై సమీక్ష

ఆలోచనాలోచనాలు

ఫిబ్రవరి 22...

వరల్డ్ థింకింగ్ డే. ప్రపంచంలో లక్షల సంఖ్యలో ఉన్న ఓ ప్రత్యేక ఉద్యమానికి చెందిన ఆడపిల్లల కోసం ఉద్దేశించిన రోజిది. పురుషాధిక్య సమాజంలో అమ్మాయిలు ఏ విషయంలోనూ వెనుకబడకుండా ముమ్ముందుకు దూసుకువెళ్ళడానికి స్ఫూర్తినిచ్చే రోజిది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో యువతులు తమ ఆలోచనలను పంచుకోవటానికి ఉన్న అన్ని మార్గాలను ఈ రోజు వాడుకుంటారు.ఇంతకు ఏమిటీ ఉద్యమం? దీనికి అమ్మాయిలకు ఉన్న సంబంధమేమిటి?

చిన్నతనం నుంచే పిల్లలకు చదువుతోపాటు సంస్కారాన్ని, దేహదారుఢ్యాన్ని, సేవాతత్పరతను అలవాటు చెయ్యటానికి దాదాపు వందేళ్ళ క్రితం ఓ మహానుభావుడు ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఆ ఉద్యమం పేరే స్కౌట్స్, గైడ్స్ ఉద్యమం.యువత వివిధ దేశాలు, జాతులు, సంస్కృతులవారిని కలుసుకుని ప్రపంచ పౌరులుగా ఎదిగే అవకాశం.ఉద్యమం ఇస్తుంది. ఈ ఉద్యమంలో చేరి శిక్షణ పొంది సేవ చేసే మగపిల్లలను స్కౌట్స్ అని, ఆడపిల్లలను గైడ్స్ అని అంటారు. కొన్ని చోట్ల అమ్మాయిలను గర్ల్ స్కౌట్స్ అనీ వ్యవహరిస్తున్నారు.ఉద్యమంలో చేరే మగపిల్లల కంటే ఆడపిల్లలకు అదనంగా కొన్ని ప్రయోజనాలున్నాయి. ఆత్మ రక్షణ, స్నేహశీలత, ఆత్మగౌరవం, తన కాళ్ళమీద తాను నిలబడగల స్థయిర్యం అమ్మాయిలకు శిక్షణ ద్వారా అలవడతాయి. అంటే ఇవ్వాళ స్త్రీవాదులు అమ్మాయిల్లో ఉండాలంటున్న లక్షణాలన్నీ అలవడతాయన్నమాట! గొప్పలక్ష్యంతో ప్రారంభించిన గైడింగ్ ఉద్యమానికి చాలా ఖర్చవుతుంది. మరి అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? అందుకే ఉద్యమ ప్రారంభకులు రాబర్ట్ బేడెన్ పావెల్ జన్మదినమైన ఫిబ్రవరి 22 ను ప్రపంచ ఆలోచనా దినంగా ప్రకటించి, ఆ రోజున నిధులను సమీకరించాలని నిర్దేశించారు. పావెల్ భార్య ఓల్వే బేడెన్ పావెల్ కూడా గైడింగ్ ఉద్యమ ప్రారంభానికి వెన్నుదన్నుగా నిలిచారు.ఆమే వరల్డ్ చీఫ్ గైడ్‌గా వ్యవహరించారు.అందుకే ఈ రోజున ఆ దంపతులిద్దరినీ స్మరించుకుంటారు. ప్రంపంచంలోని ఇతర గైడ్స్‌తో తమ తమ ఆలోచనలను పరస్పరం పంచుకోవటానికి వరల్డ్ థింకింగ్ డేని ఒక వేదికగా లక్షలాది అమ్మాయిలు భావిస్తున్నారు.

వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్ ప్రతి వరల్డ్ థింకింగ్ డే నాడు ఒక అంశాన్ని తీసుకుని దానిపై పనిచేస్తుంది. 2005లో 'ఆహారం గురించి ఆలోచించు' అనేది అది తీసుకున్న అంశం. 2015లో వారు చేపట్టిన అంశం 'ప్రపంచాభివృద్ధిలో భాగస్వామ్యాలను అభివృద్ధిపరచటం'.

భాషాభిమానం

తల్లి భాష దినోత్సవాలు జరపగానే సరిపోతుందా? ఆ భాషలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం గుర్తిస్తున్నారా? చూపాల్సిన ఆదరణ గురించి ఆలోచిస్తున్నారా? తమ ఉద్యమానికి భాషను కూడా ఒక ఎజెండాగా చేసుకున్న వారు సైతం ఆంగ్ల విద్యాబోధన వ్యామోహంలో పడి కొట్టుకులాడుతున్న వైనం గమనార్హం. తమ భాష పట్ల వివక్షని చూపారని వాదించిన రోజుల్ని అంతలోనే విస్మరించి అంతా ఆంగ్లమయం చేయాలనుకునే ఆలోచనల్ని స్వాగతించగలరా? భాషాభిమానం, మాతృభాష లేదంటే తల్లిభాష గురించి మాట్లాడేవారు యోచించాలి. ఇంటిభాష గురించి పలవరించేవారు ఆంగ్లమయం చేసే ఆలోచనలకు ఊతమిస్తారా? ఉగ్గుపాలతో నేర్చిన విద్యలోనే బోధన మంచిదని చెబుతారా? భాషాభిమానులకు ఇది పరీక్షా సమయం.

కెజి నుంచి పిజివరకు ఆంగ్లంలోనే చదవాలని జపనీయులు, రష్యన్లు, జర్మన్లు, సింహళీయులు సైతం తలపోయడం లేదు. అమెరికా గడ్డ మీద నిలబడి సామ్రాజ్యవాదాన్ని ఎదరించిన కీన్యా రచయిత ఎన్.గూగి తన తల్లిభాష గికూలోనే రచనలు చేస్తానని చెప్పారు. మొన్న జ్ఞానపీఠ పురస్కారం పొందిన బాలచంద్ర నెమాడే కూడా పరాయి భాషలో రాయాల్సిన ఆగత్యం లేదని ప్రకటించారు. ఎవరి భాషలో వాళ్ళు రాసుకోవడంలోనే ఆత్మావిష్కారం సాధ్యమని ప్రకటించారు. జపనీయులకు ఇంటా బయటా ఒకటే భాష. ఉత్తర భారతంలో హిందీనే సకల స్థాయిల్లో అమలవుతున్న భాష. హిందీ తల్లిభాషగా ఉన్నవారు ఆంగ్లం మీద మోజుతో వెంపర్లాడటం లేదు.

పదిహేను కోట్లమందికి పైగా మాట్లాడే తెలుగు భాషలో చదివితే ఉపాధి లభించని పరిస్థితి, భవిష్యత్తు ఉండని పరిస్థితి ఎంత భయానకం. కేవలం ఇది తెలుగువారి విషాదం! ఇంతగా ఒక భాషలో పుట్టిన వారు న్యూనతా భావానికి లోనయి బడికెళ్ళినప్పట్నించి మరోభాషలో చదవక తప్పని దుస్థితి ఘోరం! కానీ ఇది తెలుగువారికి సాధారణమైన అంశం. మన విద్యావిధానం, భాషావిధానం బానిస మనస్తత్వంతో కునారిల్లడం హేయం. శాస్త్రీయ విద్యావిధానం గురించి అధికారస్థానాల్లో ఉన్నవారు మాట్లాడుతున్నారు. కానీ ఎవరి తల్లిభాషలో వాళ్ళు చదువుకునే సౌకర్యాలు కల్పించడం కూడా శాస్త్రీయ విద్యావిధానంలో భాగం. పోటీపరీక్షల్లో సైతం ఇది అమలు కావాలి. ఈ దృష్టితో విద్యారంగంలో మార్పుల గురించి చర్చించాలి. ఆంగ్లభాషలో చదవకపోతే ఉపాధి లభించదనే స్థితిని తొలగించాలి. భాషాభిమానం నిండుగా వ్యక్తమయ్యేది అప్పుడు మాత్రమే. తాము మాట్లాడే భాష తమ కడుపు నింపదని తెలిసినప్పుడు ఎవరయినా మరో భాష ముందు సాగిలపడతారు. ఆ పరిస్థితిని తొలగించగల శాస్త్రీయ విద్యావిధానం అవసరం. భాషాభిమానానికీ, విద్యావిధానానికీ ఉన్న సంబంధం అర్థం చేసుకుంటే తెలుగు వాళ్ళకు భాషాభిమానం లేదని మాట్లాడరు. సకల స్థాయిల్లో తెలుగును అమలు చేయగల సామర్థ్యం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం విధాన నిర్ణేతలకు ఉంటే భాషాభిమానం పరిఢవిల్లుతుంది.

వెంటాడే వాక్యం

నైతిక ప్రమాణాలను నిర్దేశించేది రాజ్యం కాదు ప్రజలే, శక్తివంతమైన వ్యవస్థలు నీతికి కట్టుబడే విధంగా నిర్దేశించేది ప్రజలే.

- నోమ్ చామ్‌స్కీ

ప్రజాశక్తి

సోపతి

ఫిబ్రవరి 22, 2015

లేఖలు 4
కవర్‌స్టోరీ
ఈ వనరులే ప్రత్యామ్నాయం 5
కథ
అమ్మ చెబితే 9
మన మాణిక్యాలు
కొమురం భీం, రంగారావు 11
పురస్కారం
అసాధ్యమైన కల నిజమయింది 12
నెమలీక 14
సీరియల్ ప్రేమ - విప్లవం 16
సృజన
ఆమె కవిత్వం పాఠ్యాంశం 18
యాత్రా కథనం
ఎదనిండా... పాపికొండల నీరెండ 20
సంగీతం
మనసున మల్లెల మాలలూగించే సాహిత్యం 22
సోర్స్‌కోడ్
నయా 'టెలిగ్రామ్'.. ఇదో యాప్ 23
సమీక్షలు
సహృదయ విమర్శకుడు 24
ఈ వారం కవిత్వం
తప్పుకోగలిగితే 26



రోజురోజుకీ ఇంధన అవసరాలు పెరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ వనరుల కోసం చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయి. ఈ వనరులకు సంబంధించిన పలు పార్శ్వాల విశ్లేషణ ఈవారం ముఖచిత్ర కథనం.

లేఖలు

సందర్భోచితంగా ఉంది

ఆదివారం సోపతిలో' కప్పు ఎవరిది?' శీర్షికతో ప్రపంచ క్రికెట్ విశేషాలు ఇవ్వడం చాలా బాగుంది. సందర్భోచితంగా క్రికెట్ గురించి ఇవ్వడంతో క్రికెట్ అభిమానులను, పాఠకులను ఈ కవర్ స్టోరీ ఎంతో ఆకట్టుకుంది.

- యాసిన్, వికారాబాద్, రంగారెడ్డి

హ్యాకింగ్ జీవిత దృశ్య కావ్యం

ఖగోళ రహస్యాల్ని ఛేదించిన ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జీవిత విశేషాలతో తీసిన సినిమా 'ది థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్' గురించి ఆదివారం సోపతిలో వచ్చిన కథనం చాలా బాగుంది. జీవిత చరిత్రల ఆధారంగా వస్తున్న సినిమాలలో ఇదొక అద్భుతమైన దృశ్య సన్నివేశంగా కళ్లముందు నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అలాంటి ఒక మంచి స్ఫూర్తిదాయక సినిమా గురించి, అందులోనూ ప్రముఖ మేధావి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన సినిమా గురించి సోపతి పాఠకులకు అందించినందుకు కృతజ్ఞతలు.

- సురేఖ, షాద్‌నగర్, మ.నగర్‌జిల్లా

అలరించిన ప్రియరాగాలు

ఆదివారం సోపతిలో వచ్చిన 'ప్రియరాగాలు' కథనం హృదయాన్ని హత్తుకునేలా ఉంది. అపురూప ప్రేమ బంధాల మధుర భావనల మేళవింపుతో అనేక అంశాల గురించి ఇందులో చర్చించారు. ప్రేమగీతం గురించి వివరించి, విశ్లేషించడం ఈ కథనంలో ప్రత్యేకత. ఇలాంటి మరిన్ని కథనాలు రావాలని కోరుతున్నా.

- షారూన్, మల్కాజిగిరి, హైదరాబాద్

క్రీడాస్ఫూర్తి అవసరం

ఈ వారం కవర్ స్టోరీ 'ఈ కప్పు ఎవరిది అద్భుతంగా ఉంది. కప్పు చరిత్రను కళ్లకు కట్టినట్లు చెప్పారు. అదే సమయంలో భారత ఉపఖండం క్రమంగా ఎలా ఆధిపత్య స్థానానికి చేరిందో కూడా వివరించారు. మార్టిన్ క్రో, ఇయాన్ బోథమ్, ఇమ్రాన్ ఖాన్, కపిల్‌దేవ్... ఒక్కరా ఇద్దరా ఎందరో గొప్ప గొప్ప క్రికెటర్స్ పోరాట పటిమను మళ్ళీ ఒకసారి గుర్తు చేసినందుకు ధన్యవాదాలు. కప్పు ఎవరిదైతేనేం? ఆటను ఆస్వాదించి, మంచి క్రీడాకారులను అభినందించటమే మనం చెయ్యగల పని. ఇండియా ఓడిందనో, పాకిస్థాన్ గెలిచిందనో ఆవేశానికి లోనై అనవసరమైన దేశభక్తిని చాటుకునే వీరాభిమానుల పట్ల కాస్త జాగ్రత్తగా ఉండాలి సుమా!

- రవీందర్, భువనగిరి, నల్గొండ

శత వసంతాల రజనీ

బాలాంత్రపు రజనీకాంతరావుగారు గురించి రాసిన ప్రత్యేక వ్యాసానికి ధన్యవాదాలు. లలిత సంగీతమంటే వెంటనే గుర్తొచ్చేపేరు 'రజనీకాంతరావు. టీవీలు, ఎఫ్ఎంలు లేని ఆ రోజుల్లో సంగీత ప్రియుల దాహార్తిని రేడియో ద్వారా తీర్చింది రజనీనే. అడవి బాపిరాజుగారి "ఉప్పొంగిపోయింది గోదావరి, తాను తెప్పున ఎగసింది గోదావరి"అనే గీతం మేం యువకులుగా ఉన్నప్పుడు తరచుగా పాడుకుంటూ ఉండేవాళ్ళం. ఎంత బాగా పాడారు రజనీ ఆ గీతాన్ని! దేవులపల్లి కృష్ణశాస్త్రితో కలిసి ఆయన రేడియోలో సృష్టించిన తుఫాను గురించి మళ్ళీ గుర్తు చేసినందుకు రచయితకు మరోసారి థాంక్స్.

- రంగనాథ్, ఉప్పల్, హైదరాబాద్

మన జాతీయాలు

పచ్చని చెట్టు

పండ్ల గంప తెంపి కుప్ప పోసిన పరిస్థితి. పచ్చని చెట్టు వల్ల కడుపు నిండదు. కాని సేద తీరుతుంది. కొందరు ఇరుగుపొరుగు వారు పెత్తలలు తమకున్నది తీసి దానం చేయలేకున్నా చల్లని మంచినీళ్ళివ్వటం, ఇంటికి వచ్చిన వారితో ప్రేమగా మాట్లాడటం, ఎవరివల్లనైనా ఆపద వస్తే తమ పంచన చేర్చుకొని కాపాడటం, చెడ్డ త్రోవల పోకుండా బుద్ధి చెప్పటం, ప్రసూతి, రోగం, చావు, శుభకార్యాల్లో మద్దతుగా వుండి కార్యాన్ని నిర్వహించటానికి తోడ్పడటం లాంటి సహాయాలు చేస్తారు. వాళ్ళ దగ్గర ధనదాన్యాలు లేకపోవచ్చు కాని ఔదార్యం, ఆప్యాయత, అనునయం వుంది. వారే పచ్చని చెట్లు. "భీమన్న చచి ఏ లోకానికి పోయిండో గాని పచ్చని చెట్టురా. ఎవరికే కష్టం వచ్చిన దగ్గరుండి అన్ని సేవలు చేసేటోడు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం కనిపిస్తుంది.

గూటిలో రూపాయి

మట్టి గోడల్లో మట్టి పాత్రను పొందించి రూపాయలు సొమ్ములు దాచుకోటానికి గూళ్ళు వాడుకునే వారు. పేదవాని కోశాగారం గూడు. గూటిలో చేరటమంటే ఎంతో గగనం. ఎంతో కష్టపడి గూటిలోకి రూపాయి చేర్చగలిగాడు. అక్కడ నుండి గాలి మేడలు కట్టటం ప్రారంభించాడు. 'గూట్లోక్క రూపాయి ఉన్నది పన్నెండేస్తే పడిగెలయితయ'నిఒక సామెత. రొండిలో దాచుకోటానికే పైసలు కరువైనవాడు గూట్లో రూపాయి పడే దశకు వస్తే ధనం ఊరికే వుండనీయదు. కలలు కంటాడు. గూట్లో రూపాయి నా మగడు సిపాయి. రూపాయి వుంటెనే బహదూర్ కింద లెక్క. గూట్లె రూపాయి చేరడమంటే సంపాదన దిశగా ప్రయాణించడమే మరి. "గూటిలో రూపాయి ఉన్నందుకే కూత మారింది. మేము చెప్పుతాం నీతులు గూటిలో రూపాయి ఉంటే" అనటంలో ఈ జాతీయం తరచుగా వినిపిస్తుంటుంది.

ఒడిబియ్యం

ఆడబిడ్డలకు తల్లిదండ్రులు చీరెసారె పెట్టేటప్పుడు విధిగా ఒడిలో బియ్యం కూడా పోస్తారు. ఒడి నిండుగా వుండాలని ఆకాంక్షించటం. ఒడిలో పోసే బియ్యం ఒడి బియ్యమైతే, ఒడి నింపుట కూడా ఇదే. 'దేవుడు నీకు సంత ఎప్పుడు కలుగజేస్తాడో' అంటే నీ 'ఒడి ఎప్పుడు నింపుతాడోననటం'. ఒడి నింపటం, సంతాన భాగ్యం కలుగజేయటమని అర్థం.

- వేముల పెరుమాళ్ళు

■ కవర్ స్టోరీ



ఈ వనరులే ప్రత్యామ్నాయం

మన జ్ఞాపకాల్ని, చరిత్రని, వర్తమాన పరిణామాల పరంపరని ఇంటర్‌నెట్‌లోనే భద్రపరుస్తున్నాం. కానీ ఏదో ఒకనాడు ఇంటర్‌నెట్ వ్యవస్థ కుప్పకూలితే పరిస్థితి ఏమిటని నెట్ వ్యవస్థాపకులే ప్రశ్నిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దిలో సకల రంగాల రికార్డునంతా నెట్‌లోనే నిక్షిప్తం చేస్తున్నారు. మరీ ఆ నెట్ వ్యవస్థ స్తంభించిపోతే ఏం చేస్తారు? ఒక్కసారి ఊహించండి! నిన్నమొన్న మన జీవితాల్ని ఆక్రమించిన నెట్‌వ్యవస్థ లేకుండా పోతుందనే ఊహనే భయానకం. ఇదే సూత్రం కరెంటుకు వర్తింపజేస్తే బీభత్సమే. కరెంటు లేని కాలంలోనే తాజ్‌మహల్, ఖజురాహో, మన చార్మినార్, గోల్కొండ కట్టడాలు నిర్మించారుగానీ ఇవాళ కరెంటు లేకుండా పది నిమిషాలు కూడా గడవదు. వ్యవస్థ అంతా అతలాకుతలమైపోతుంది. అందువల్లనే కరెంటు కోతలంటే చిరాకు, విసుగు, అసహనం. అలాంటిది కనీస అవసరాలు తీరడం కష్టంగా పరిణమించేవిధంగా ఇంధన వనరులు తరిగిపోతే మామూలు జీవితం గడపడం ఎంత కష్టం!

ఈ కష్టాలు నగరవాసులకన్నా ఇవాళ పల్లె ప్రజలకు బాగా తెలుసు. కరెంటు కోతల కాలంలో పగళ్ళు, రాత్రులు ఎంత బరువుగా, భారంగా, దుర్భరంగా గడుస్తాయో ఏ పల్లెకు వెళ్ళినా చెబుతారు. అయితే అసలు పల్లెలు, పట్నాలు అనే తేడా లేకుండా ఇంధన వనరులు అందుబాటులో లేని పరిస్థితి వస్తే భరించగలమా? ఈ ప్రశ్న అభివృద్ధి చెందుతున్న దేశాల కన్నా అభివృద్ధి చెందిన దేశాల్ని మరింతగా వేధించింది. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ మొదలయింది. అనేకరకాల పరిశోధనల ఫలితంగా సాంప్రదాయేతర ఇంధన వనరులని అభివృద్ధి చేసుకోవడం మీద దృష్టి సారించారు.

ప్రత్యామ్నాయ వనరులు తప్పనిసరి

జలవిద్యుత్, థర్మల్ విద్యుత్ మీద ఆధారపడి మనగలగడం ఎల్లకాలం కుదరదని గత రెండుమూడు దశాబ్దాల పరిణామాలు చెబుతున్నాయి. మన ఇంధన అవసరాలు పెరుగుతున్నకొద్దీ ప్రత్యామ్నాయాల కోసం చూడటం అనివార్యమైంది. ఈ క్రమంలోనే భవిష్యత్ ఇంధన అవసరాల కోసం అన్వేషణ తీవ్రమైంది. ఫలితంగా సౌరశక్తి, వాయుశక్తి, హైడ్రోజన్ శక్తి మొదలయిన వాటిని అభివృద్ధి చేసుకోడం మీద మరింత శ్రద్ధ కనబరిచారు. సౌర విద్యుత్, పవన విద్యుత్ పథకాల కోసం కోట్ల రూపాయలు వెచ్చించడానికి ప్రభుత్వాలు సిద్ధపడినాయి.

ప్రధాన వనరు సూర్యుడు

జలాలు ఎల్లకాలం అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. అలాగే థర్మల్ విద్యుత్‌కు అవసరమైన బొగ్గుగనులు తరిగిపోతున్నాయి. వేలాది టన్నుల బొగ్గును ఇంధనం కోసం ఉపయోగించారు. కానీ బొగ్గు గనులు క్రమక్రమంగా తరిగిపోతున్నాయి. ఎక్కువకాలం వీటి మీద ఆధారపడే పరిస్థితి లేదు.

అందువల్ల భవిష్యత్ ఇంధన అవసరాల కోసం వివిధ దేశాల్లోని ప్రభుత్వాలు సౌరశక్తిని నమ్ముకుంటున్నాయి. ఈ ప్రపంచానికి శక్తినిచ్చేది సూర్యుడే. సూర్యుడి కిరణాల నుంచి శక్తిని గ్రహించి ఇచ్చే చెట్లు మానవుడికి ప్రధాన ఇంధనం. కర్రలు, పుల్లలు ఆదిమ మానవునికి ఇంధనమయితే, భూమిలో రూపాంతరం చెందిన వృక్షాల వ్యర్థాలు బొగ్గుగా, పెట్రోలియంగా మానవుడికి ఇంధనంగా ఉపయోగ పడుతున్నాయి. వీటన్నిటి శక్తికి మూలమైన సౌరశక్తిని ఎందుకు వాడకూడదన్న ఆలోచన మానవులకి ఎప్పట్నించో వుంది. సూర్యశక్తిని సోలార్ సెల్స్ ద్వారా విద్యుచ్ఛక్తిగా రూపాంతరం చెందించే దశలో జరిగిన ప్రయోగాలు ఫలించటం వల్ల అమెరికా, స్పెయిన్, ఆఫ్రికా వంటి దేశాల్లో సౌరశక్తి వాడకం మీద ఆసక్తి పెరిగింది. తర్వాతి క్రమాల్లో జపాన్, ఇండియా మొదలైన ఆసియా దేశాలలోనూ సౌరశక్తిని అధికంగా తయారు చేసి వినియోగించే ప్రయత్నాలు ముమ్మర్మం చెందాయి.

ఇళ్ల కప్పులపై సోలార్ 'థర్మల్ ప్యానెల్స్'ను ఏర్పాటు చేయటం వల్ల సౌరకాంతిలోని వేడి ద్వారా నీటిని వేడి చేయటం, ఇళ్ళకు వెచ్చదనాన్నివ్వటం జరుగుతోంది. ఆరిజోనాలోని ఫీనిక్స్ ప్రాంతంలో సూర్యకాంతి అధికంగా ఉండటంతో ఆ కాంతి నుంచి సౌరశక్తిని గ్రహించే ప్రయత్నాలు పకడ్బందీగా జరిగాయి. ప్రపంచంలోని తొలి సోలార్ పవర్ ప్లాంట్ మొజేవ్ ఎడారిలో ఏర్పాటయింది. కాలిఫోర్నియాలో విద్యుత్ కొరత ఏర్పడినప్పుడు సోలార్ ఎలక్ట్రిక్ జనరేటింగ్ సిస్టమ్స్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగింది. ఈ విజయంతో జపాన్, స్పెయిన్, ఇటలీ, ఆస్ట్రేలియా, భారత్ మొదలైన దేశాలు సౌరశక్తి ద్వారా భవిష్యత్ ఇంధన అవసరాలు తీర్చడం కోసం వ్యూహాత్మకమైన ప్రణాళికలు రూపొందించి అమలుకు ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సౌరశక్తి తయారీ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించడానికి సిద్ధపడినాయి. ఇప్పటివరకు అక్కడక్కడా సౌరశక్తికి సంబంధించిన యూనిట్లున్నాయి. ముమ్ముందు ఈ ఇంధన ఉత్పత్తులు మరింత పెరగడానికి అవసరమైన చర్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవడం గమనార్హం. అయితే వీటిలో ప్రైవేటు రంగం వాటా అధికమయితే ప్రజలకు చౌకగా లభించదు. ప్రైవేటు రంగంలో విద్యుత్ తయారు చేసి అమ్మినట్టుగానే సౌరశక్తి ద్వారా అవసరాలకు మించి అదనంగా ఇంధనం ఉత్పత్తి చేసి, అమ్మటం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. సూర్యుడు ఉన్నంతకాలం సాగే లాభసాటి వ్యాపారం కాబట్టి ఈ రంగంలో కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి అనేక



సంస్థలు ముందుకు వస్తున్నాయి.

హైడ్రోజన్ ఇంధనం

దీని తయారీలో రెండు పద్ధతులున్నాయి. నీటి అణువు H_2Oను విద్యుత్ ద్వారా విడగొట్టడం వల్ల హైడ్రోజన్ విడుదలవుతుంది. ఇది అధికవ్యయంతో కూడుకొన్నది. ఇదిగాక మిథేన్‌ను నీటిఆవిరితో కలిపి ఒత్తిడికి గురి చేయటం వల్ల కూడా హైడ్రోజన్‌ను విడగొట్టడం సాధ్యం. దీనికి తక్కువ ఖర్చు అవుతుంది.

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ బ్యాటరీలా పాజిటివ్, నెగెటివ్ ధ్రువాల నడుమ ఇంధనాన్ని సరఫరా చేస్తుంది. బ్యాటరీ విద్యుత్‌ను నిల్వ చేస్తుంది. హైడ్రోజన్ సెల్ విద్యుత్‌ను సృజించి, విడుదల చేస్తుంది. హైడ్రోజన్ సెల్‌లోని రుణాత్మక ధ్రువం నుంచి హైడ్రోజన్‌ను లోపలకు పంపుతారు. విద్యుత్ ఉత్పన్నమై హైడ్రోజన్ లోని ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు వేరు పడతాయి. అప్పుడు ధనాత్మక ధ్రువం నుంచి ఆక్సిజన్‌ను పంపుతారు. ఎలక్ట్రాన్లు ఆక్సిజన్ వైపు పరుగులు తీస్తాయి. వాటి దారిలో ప్లాటినం తెరను ఉంచుతారు. దాంతో ప్లాటినం నుంచి వెళుతూ ఎలక్ట్రాన్లు ఇంధనం ఉత్పత్తి చేస్తాయి. ఇదే సమయంలో ప్రోటాన్లు వెళ్ళి ఆక్సిజన్‌తో కలిసి నీటిని తయారు చేస్తుంది. నీటి నుంచి మళ్ళీ హైడ్రోజన్ ఆక్సిజన్‌ను వేరు చేయడం వీలుపడుతుంది. హైడ్రోజన్‌ను రుణాత్మక ధ్రువం నుంచి, ఆక్సిజన్‌ను ధనాత్మక ధ్రువం నుంచి లోపలకు పంపవచ్చు. ఈ క్రమంలో

ఇల్లే విద్యుత్ కేంద్రం



ఇప్పటివరకు ఇళ్లలో అవసరాలకు గాను కరెంటు తీగల ద్వారా వచ్చే విద్యుత్‌మీదనే ఆధారపడినారు. బొగ్గు, పెట్రోలు, సహజవాయువులు వాడుతున్నారు. జలవిద్యుత్ ఉపయోగిస్తున్నారు. కానీ ఇకముందు ప్రతి ఇల్లు ఒక విద్యుత్ ఉత్పాదక కేంద్రంగా రూపొందడం అవసరం. వాయువు ద్వారా, సౌరశక్తి ద్వారా, హైడ్రోజన్ ద్వారా శక్తి ఉత్పత్తి చేసి వాడుకుని, అదనంగా మిగిలిన దానిని 'గ్రిడ్'కు అమ్ముకునే వీలుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో అపార్ట్‌మెంట్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఇవి అమలులోకి వస్తే కరెంటు కోతల నుంచి ఉపశమనం లభిస్తుంది. భవిష్యత్ ఇంధన అవసరాల కోసం ఇంకా ఈరకమైన వ్యూహాలు అమలు చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి.

వచ్చే హైడ్రోజన్ శక్తిని వినియోగించి కారులు కూడా నడుపుతున్నారు. హైడ్రోజన్ కారు చూడటానికి ఇతర కార్ల మాదిరిగానే మామూలు కారులా ఉంటుంది. కానీ కారులో పెట్రోలుకు బదులుగా హైడ్రోజన్ వాయురూపంలో లేదా ద్రవరూపంలో ఉంటుంది. కారులోని హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఇంధనం ఉత్పత్తి చేస్తుంది. పెట్రోలు కార్లు కార్బన్ వదిలితే ఈ కారు నీరు విసర్జిస్తుంది. హైడ్రోజన్ సెల్‌లో ఉత్పత్తి అయిన కరెంటు ద్వారా ఇన్వర్టర్ మోడ్యూలు కారును కదిలిస్తుంది. ఈవిధంగా కొన్ని దేశాలలో హైడ్రోజన్ వాడకం ద్వారా కార్లు నడుపుతున్నారు. కనుక భవిష్యత్ ఇంధనాలలో హైడ్రోజన్ ఇంధనం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఐస్‌లాండ్‌లో ఎక్కువగా హైడ్రోజన్ ఇంధనం ద్వారానే విద్యుత్ అవసరాలు తీర్చుకుంటారు. ఇంకా అమెరికా, పోర్చుగల్, నార్వే, కెనడా, డెన్మార్క్, జర్మనీ, జపాన్‌లలో ఈ ఇంధనాల ఉత్పత్తి ప్రాధాన్యం సంతరించుకుంది. చైనాలోనూ ఈరకమైన సహజవాయువు వినియోగానికి తగిన ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఇది పర్యావరణానికి హాని చేయదు. కనుక దీని అవసరం, ఉపయోగం పట్ల ఆయా దేశాలలో స్పృహ ఏర్పడింది.



వాయుశక్తి అనంతం

తరగని చెరగని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల్లో ఒకటి వాయువు. వాయుశక్తి అనంతమైంది. గాలిలో ఉన్న వాయువును ఉపయోగించి ఇంధనం ఉత్పత్తి చేసే విధానం పర్యావరణానికి కూడా ఉపయోగకరం. ప్రకృతికి హాని చేయని విధానం ఇది. ఎలాగయితే ప్రవహించే నీరును టర్బయిన్లను కదపటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామో, అలాగే టర్బయిన్ల ద్వారా వాయువును ఉపయోగించి విద్యుత్ తయారు చేయడం సాధ్యం. మొదట్లో ఈ ఆలోచనని కొందరు కొట్టిపడేసారు. కానీ బ్రస్సెల్ కేంద్రంగా యూరోపియన్ విండ్ అసోసియేషన్ వాయుశక్తి మీద పరిశోధనలు జరిపి ఫలితాల్ని సాధించింది. ఒక టర్బయిన్ ద్వారా తయారయ్యే ఇంధనం వల్ల దాదాపు 800 ఇళ్ళ విద్యుత్ అవసరాలు తీరుతాయన్నది ఒక అంచనా. నార్వేలోనూ ఈ ఇంధనం తయారీకి జరిగిన పరిశోధనలు ఫలించాయి. న్యూజిలాండ్‌లో ఈరకంగా ఇంధనం తయారు చేసి అమ్మే యూనిట్లు లాభసాటిగా వున్నాయి. దీనినే పవన విద్యుత్ అంటారు. ఈరకమైన ఇంధనం తయారీ ప్లాంట్స్ నిర్మాణం పట్ల ఇప్పుడు మనదేశంలోనూ ఆసక్తి పెరిగింది. భూమ్మీదా, సముద్రం సహజంగా వీచే గాలి ఈరకమైన ఇంధన ఉత్పత్తులకు ఉపయోగిస్తున్నారు. మన దేశంలో ఈరకమైన ఇంధనాన్ని 45000 మెగావాట్లు ఉత్పత్తి చేయగలరని భావిస్తున్నారు. కనుకనే ఇటీవల ఈ రంగంలో ప్రైవేటు రంగానికి అనుమతులు ఇస్తున్నారు. పర్యావరణానికి హాని చేయని ఇలాంటి ఇంధన తయారీ పద్ధతులు విస్తృతంగా అమలు చేయాలని ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

బయోమాస్

బయోస్ అంటే జీవం అని అర్థం. జీవుల, వృక్షాల ద్వారా ఇంధనాన్ని గ్రహించే వీలుంది. గడ్డి మొదలయిన వాటి ఆధారంగా ఇంధనాన్ని 'బయో ఫ్యూయల్స్' అంటారు. ఈ బయో వ్యర్థ పదార్థాలు కుళ్ళటం వల్ల మిథేన్ ఉత్పత్తి అవుతుంది. వీటి నుంచి ఆర్గానిక్ పదార్థాలు వెలికి తీయటం వల్ల ఇథేన్, ఇథనాల్ మిథైల్ ఆల్కహాల్ వంటి ఇంధనాలు తయారవుతాయి. ఈ బయో ఇంధనాల ఉత్పత్తి అమెరికా, జపాన్, కొన్ని యూరప్ దేశాలలో బహుళ ప్రాచుర్యంలో వుంది. కుళ్లిన చెత్త నుంచి ఉత్పత్తయ్యే మిథేన్‌ను పైపుల ద్వారా పవర్ ప్లాంట్‌కు చేరవేసి ఇంధనాన్ని తయారు చేస్తున్నారు. మొక్కజొన్న, సోయా వంటి వాటి నుంచి 'ఇథనాల్' తయారీ విపరీతంగా వుంది. బయో ఇంధనాల తయారీలో ఇది ముఖ్యమైనది. కనుక అమెరికా, యూరప్, లాటిన్ అమెరికాలలోని రైతులు ఈరకమైన ఇంధనాల



తయారీకి ఉపకరించే పంటలు పండించడానికి పోటీపడుతున్నారు. పెట్రోలు వంటి ఇంధనాలలో కార్బన్ ఉంటుంది. వాటి వాడకం వల్ల వాతావరణంలోకి అదనపు కార్బన్ వచ్చి చేరుతుంది. దీనితో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. కానీ బయోమాస్‌లోని కార్బన్ వాతావరణంలోని కార్బన్. కనుక అదనంగా వాతావరణంలో కార్బన్ చేరదు. అందుకని బయోమాస్ ఇంధనాలకు ఉపకరించే పంటలు పండించటం కోసం అడవులను నరికి వేస్తున్నారు. ఇది మరోరకమైన పర్యావరణ సమస్యలకి దారితీస్తుంది. అయినప్పటికీ అమెరికా మొదలైన దేశాల్లో ఈరకమైన ఇంధనం తయారీ మీద ఎక్కువ దృష్టి సారించారు. మనదేశంలో లభించే ముఖ్యమైన శక్తివనరుల్లో బయోమాస్ కూడా ఒకటి. దేశం మొత్తం ఇంధన వినియోగంలో దీని వాటా ముప్పయి శాతం. ఇంకా ఇది పెరగాల్సిన అవసరముంది. అలాంటప్పుడే గ్రామీణ గృహావసరాలు తీరడం సులువు.

జియో థర్మల్ శక్తి

భూగర్భంలోకి వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతుంది. భూమిలో నిక్షిప్తమై వున్న ఈ ఉష్ణాన్ని ఇంధనంగా వాడటాన్ని 'జియోథర్మల్ ఎనర్జీ' (భూ ఉష్ణశక్తి) అంటారు. ఈ శక్తి నుంచి ఇంధనం తయారీకి భూమిలోకి రెండు బావులు తవ్వుతారు. ఒక బావి నుంచి నీటిని లోపలకు పంపుతారు. భూమిలోకి వెళుతున్న కొద్దీ నీరు వేడెక్కుతుంది. అలా వేడెక్కిన నీరు ఆవిరై, అత్యంత వేగంతో రెండో బావి నుంచి పైకి ఎగజిమ్ముబడుతుంది. ఈ నాటి

పర్యావరణానికి అనువుగా...

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం చేసే ప్రయత్నాలు పర్యావరణానికి అనువుగా ఉండాలి. ప్రతి దశలోనూ ఇంధన వనరులను కనుగొనడం, అభివృద్ధి పరచడం కీలకం. అయితే ప్రకృతి సమతుల్యానికి, పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడాలి. బొగ్గుగనులు కనుగొన్నప్పట్నించి ప్రపంచవ్యాప్తంగా వాటిని తవ్వి వాడుకుంటున్నారు. కానీ ఆ వనరులకు కూడా పరిమితులున్నాయని తెలిసి వచ్చింది. అలాగే చమురు నిక్షేపాలు కనుగొని ఉపయోగించుకుంటున్నారు. వాటి పరిమితుల్ని గుర్తించక తప్పలేదు. అణు విద్యుత్ ఉత్పాదనలోని సాధకబాధకాలు, బీభత్సపూరిత ఫలితాలు తెలిసివచ్చాయి. పర్యావరణానికి ఎంత నష్టం కలిగించే అవకాశముందో ఇంకా అనేక పరిశోధనలు చెబుతూనే వున్నాయి. కనుక ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం అన్వేషణ పర్యావరణానికి అనువుగా ఉండాలి. ఈ దిశగా శాస్త్రజ్ఞులు, పర్యావరణవేత్తలు చేసే కృషి ముఖ్యమైంది. వీటిని అధ్యయనం చేసే మన అవసరాలకు ఏ మేరకు ఉపయోగించుకోగలమో ప్రభుత్వాలు ఆలోచించి అమలు చేయాలి. అప్పుడే ప్రత్యామ్నాయం నిజమైనదవుతుంది.

ఆవిరిలోని శక్తి ద్వారా టర్బయిన్లు తిరుగుతాయి. ఈ టర్బయిన్ల కదలిక నుంచి విద్యుత్ వస్తుంది. ఒకవేళ నీరు ఆవిరి అయ్యేంత వేడి లేకపోతే, నీటి బదులు త్వరగా ఆవిరయ్యే ద్రావకాన్ని వాడుతారు. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమెరికాలోని ఆలస్కా ప్రాంతంలో మెరుగుపరిచారు. ఈరకమైన ఇంధనం తయారీ ఎల్‌సాల్వడర్, కీన్యా, ఫిలిప్పీన్స్, ఐస్‌లాండ్ మొదలయిన దేశాల్లో జరుగుతోంది. వారి ఇంధన అవసరాల్లో దాదాపు పదిహేను శాతం జియోథర్మల్ మార్గాల ద్వారానే తీర్చుకుంటున్నారు. సాధారణమైన మాటల్లో చెప్పాలంటే భూ ఉష్ణశక్తి అంటే భూమి నుంచి పుట్టిన ఉష్ణశక్తి. ప్రకృతిలో ఉండే వేడి జలలు భూ ఉష్ణశక్తి వనరుల ఉనికిని సూచిస్తాయి. భారతదేశంలో ఇలాంటి వేడిజలలు దాదాపు 300 దాకా ఉన్నాయి. వీటినుంచి వచ్చే శక్తిని వాడుకలోకి తీసుకు రావాల్సిన అవసరముంది.

అణుశక్తికి సైతం పరిమితులు

అణువిద్యుత్ తయారీ మీద అనేక పరిశోధనలు జరిగాయి. కానీ అణుశక్తిని ఉపయోగించుకుని విద్యుత్ తయారు చేయడం పట్ల వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. పర్యావరణానికి క్షేమకారం కాదన్నది రుజువయింది. 'చెర్నోబిల్ దుర్ఘటన'ను ప్రపంచం మరిచిపోలేదు. కనుక అణువిద్యుత్ కర్మాగారాల పట్ల ఏ ప్రాంత ప్రజల్లోనూ సానుకూలత లేదు. బలవంతంగా అణువిద్యుత్ తయారీకి ప్రయత్నిస్తున్నారు కానీ ప్రజల సమ్మతి లేదు. తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఇచ్చే హామీలు అమలులో నెరవేరతాయని ప్రజలు భావించడం లేదు. కనుక దీనిని ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా కోరుకోవడం లేదు. అంతేగాక ముడిపదార్థమైన యురేనియానికి ఎంతో కొరత వుంది. దాని వాస్తవిక అవసరం దృష్ట్యా చూస్తే, యూరేనియం నిల్వలు ఇక 30-60 సంవత్సరాలకు మించి రాకపోవచ్చన్నది అంచనా. కనుక ప్రత్యామ్నాయ వనరుగా అణుశక్తిని భావించడానికి వీల్లేదు. అందువల్లనే ఇంధన ఉత్పత్తుల పెంపుదలకు ఇతర వనరుల మీద ఆధారపడాల్సి వుంది.

ఇప్పటివరకు జలవిద్యుత్ గాక బొగ్గు, చమురు, సహజవాయువుల వినియోగం ద్వారా లభించే ఇంధనాల వాడకం మన దేశంలో ఎక్కువ. దేశంలోని విద్యుత్ అవసరాల్లో యాభై శాతం బొగ్గు ద్వారానే తీరుతోంది. కానీ బొగ్గు గనుల నిల్వలు తరిగిపోతున్నాయి. చమురు, సహజవాయువుల నిక్షేపాలకు సైతం పరిమితులున్నాయి. అందువల్ల ప్రత్యామ్నాయ వనరుల మీద దృష్టి నిలపడం అవసరం. ఈ దిశగా సౌరశక్తి, పవనవిద్యుత్‌ను పెంచుకోవడం తప్పనిసరి. అలాగే బయోమాస్, భూ ఉష్ణశక్తి ఇంకా ఇతరేతర వనరుల వినియోగం ద్వారా మన భవిష్యత్ ఇంధన అవసరాల్ని తీర్చుకోడానికి దీర్ఘకాలిక దృష్టితో ప్రణాళికలు రూపొందించుకోవాలి. అదే సమయాన ఈ ఇంధన ఉత్పత్తుల వినియోగం ప్రజలకు భారంగా పరిణమించకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత.

- ఎస్.దుర్గాప్రసాద్



— భీమరాజు వెంకటరమణ

అమ్మ చెబితే

ఈ రోజుల్లో ఇల్లు లేనివాడు ఉంటాడేమో కానీ సెల్లు లేనివాడు ఉండడు. నలుగురిలో కొందరు సెల్ఫోన్‌లో కాస్త చిన్నగా మాట్లాడతారు. బహుశా వారి వ్యక్తిగత విషయాలు ఎవరూ వినకూడదని కాబోలు. లేదా నలుగురిలో పెద్దగా మాట్లాడటం సభ్యత కాదని కూడా కావచ్చు. వాళ్ళకు నా ప్రణామాలు. కానీ కొందరి సంభాషణ చాలా దారుణంగా వుంటుంది. వాళ్ళు ఫోన్‌లో మాట్లాడే స్థాయి ఎలా వుంటుందంటే అసలు ఫోన్ లేకుండానే ఆ వినే వ్యక్తి ఏ ఊర్లో ఉన్నా ఆకాశవాణిలా అతనికి వినపడగలదు. ప్రపంచంలో తామొక్కళ్ళే ఉన్నట్లు భావించి తమ శక్తినంతా కూడగట్టుకుని మాట్లాడతారు.

ఆ రోజు పనిమీద కొత్తగూడెం వెళ్ళి తిరుగు ప్రయాణం హైద్రాబాద్‌కి మధ్యాహ్నం పూట బస్సులో వస్తున్నాను.

బస్సు ఖమ్మంలో ఆగింది. కొందరు దిగారు. కొందరు ఎక్కారు. బస్సు బయలుదేరింది. పది నిముషాల తర్వాత నాకు హింస మొదలైంది. నా వెనుక సీటులో కూర్చున్న వ్యక్తి కంచు కంఠంతో సెల్ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు.

మొదట ఆ స్వరం కాసేపు భరించలేకపోయిన మాట నిజమే. కానీ తరచూ ప్రయాణాలు చేసే నేను మా అమ్మ చెప్పిన చిట్కా ఒకటి అమలు చేస్తుంటాను. అదేమంటే "మనల్ని ఏ విషయమైనా బాధిస్తుంటే చెదిరిపోక అందులో తలదూరిస్తే అది బలహీనమైపోతుంది" అని. సెల్ఫోన్ సంభాషణలు మనల్ని బాధించేప్పుడు చిరాకుపడక శ్రద్ధగా విన్నామంటే కాలక్షేపం, ఒక్కోసారి పత్రికలో ఏదో ఒక కథ చదివిన ఫీలింగ్ కూడా కలుగుతుంది. మనల్ని మనం అలా మలుచుకోవాలి. వెంటనే స్థిమితపడి శ్రోతగా మారిపోయాను. ఆయన మాట్లాడుతున్నది ఏదో పెళ్ళి సంబంధం గురించని నిముషంలో అర్థమైంది.

"హలో! బాబూరావుగారు! నేను జనార్ధన్‌ని మాట్లాడుతున్నా! ఖమ్మం నుండి బయలుదేరా, సాయంత్రం ఆరుకల్లా హైదరాబాదు చేరిపోతా. మీరేం వర్రీ అవకండి, శేఖర్‌గారు నాకు బాగా తెలుసు. ఆరు నెలల క్రితం వరకూ మా పక్కింట్లో అద్దెకుండి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అయ్యారని చెప్పాగా. దిల్‌సుఖ్‌నగర్లోనే పని చేస్తున్నాడని విన్నా. బ్యాంకు దగ్గరే పట్టుకుంటాలెండి. ఏడింటి వరకూ బ్యాంకులోనే ఉంటాడు. ఖమ్మంలోనూ అంతే, మేనేజర్ కదా! ఆలస్యంగా ఇంటికెళతాడు. వీలైతే ఆయనతో వాళ్ళ ఇంటికి కూడా వెళతాను.

ఆయన సెల్ నెంబరుకి చేస్తుంటే రావట్లేదు. లేకుంటే ఫోన్‌లోనే పని కానిచ్చేద్దును. అయినా పర్వాలేదు. సంబంధం ఖాయం చేస్తాగా, శేఖర్ గారి అమ్మాయికి మీ వాడికి మంచి జోడీ. అందుకే మీకు చెప్పా. వ్యవహారం మొదలెట్టినోణ్ణి పెళ్ళి కార్డుదాకా తీసుకురానా ఏంటి? హలో! హలో! హలో! సిగ్నల్ పోయిందే".

కాసేపు విరామం. ఇకపై ఆయన్ను నేను జానీ అని పిలుచుకోవాలని నిర్ణయించుకున్నా. బస్సు సూర్యాపేట చేరింది. అప్పుడు చూశా ఆయనగారి ముఖారవిందాన్ని. అప్పటి దాకా ఆయన కంఠాన్ని బట్టి ఏ ఎస్వీరంగారావులాగా భారీ శాల్తీ అనుకున్నా. వెనక్కు తిరిగి చూద్దామని ఒకటిరెండు సార్లు అనుకుని బావుండదేమో అని ఊరుకున్నా.

ఇప్పుడు చూశాను. నా అంచనాలకు విరుద్ధంగా బక్కపల్చగా, గుబురు మీసం, తెల్లప్యాంటు, చొక్కా. జేబులో ఒక పెన్ను, కొన్ని కాగితాలు పైకి కనబడుతున్న యాభైరూపాయల నోటు. చాలా మంది దిగారు. నేను బస్సులోనే కూర్చున్నా. కిటికీలో నుంచి జానీని చూస్తున్నాను. ఎడం పక్కగా వెళ్ళి అక్కడున్న స్టాల్‌లో యాపిల్ జ్యూస్ తాగుతున్నాడు. అవును మరి బాగా బలం రావొద్దూ మాట్లాడటానికి?

అయ్యో! సెల్ఫోన్ తీసి ఏవో నెంబర్లు నొక్కేసి మాట్లాడేస్తున్నాడు! ఎవరికై వుంటుంది? మ్యాటర్ మిస్సయ్యేట్లుందే! పర్వాలేదులే ఆయన వచ్చాక మళ్ళీ ఫోన్ చేసినప్పుడు ఆ మాత్రం ఊహించుకోవచ్చు అనుకున్నా. అలవాటేగా! కాసేపటికి డ్రైవర్ వచ్చి తన సీట్లో కూర్చొని హారన్ కొట్టాడు.

అందరూ హడావిడిగా బస్సు ఎక్కేశారు. జానీ కూడా వచ్చి తన సీట్లో ఆసీనుడయ్యాడు. ఇంకా ఫోను మాట్లాడడేంటి? నాకు వెలితిగా వుంది.

నన్ను నిరుత్సాహపరచటం ఇష్టం లేకనేమో పావుగంటకే మొదలెట్టాడు.

“హలో శేఖర్ గారేనా మాట్లాడేది? హలో.. మేడమ్ మీరా? బావున్నారా? నేను జనార్థన్నండి! ఖమ్మంలో మీరు మా పక్కింట్లో ఉండేవాళ్ళు, ఆ! బావున్నామండీ.. మీరెలా వున్నారు? శేఖర్‌గారు లేరా? సెల్ మర్చిపోయి వెళ్ళారా? పర్వాలేదు, నేను ఆయన్ను కలవడానికే హైద్రాబాద్ వస్తున్నానండి. పనంటే... ముఖ్యమైనదే.. ఫోన్‌లో ఎందుకులెండి! వీలైతే శేఖర్‌గార్ని కలిసి ఆయనతో ఇంటికి వస్తాను. మళ్ళీ రాత్రికే బయలుదేరి ఖమ్మం వెళ్ళాలి. హలో.. హలో.. హలో...”

సిగ్నల్ పోయినట్లుంది. మళ్ళీ విరామం.

హమ్మయ్య పర్వాలేదు. గురుడు డ్యూటీమీదనే ఉన్నాడు. అంతలోనే నా చెవులు పులకించాయి. జానీ సెల్ మోగింది. ఎక్కడినుంచో? ఆ మేడమ్ చేసిందా? లేక భర్తకు ఫోన్ చేసి ఆమె చెబితే ఆయన అదే శేఖర్ చేస్తున్నాడా? లేక బాబూరావా? మరెవరైనానా? జానీ గొంతు హుషారుగా పలుకుతోంది.

ఖాళీగా వుండడమెందుకని ఊహించటం మొదలుపెట్టాను. అయితే జానీకి వాళ్ళ దగ్గర నిజంగానే మంచి పేరు ఉన్నట్లుంది. అసలే అమ్మాయిలు దొరక్క అబ్బాయిల తల్లిదండ్రుల తలలు పట్టుకుంటున్నారు. మంచి ఘనకార్యం మీదే హైద్రాబాద్ వస్తున్నాడన్నమాట! ఒక బ్రహ్మచారి చెర విడిపిస్తాడు కాబోలు! అయితే ఈయన శేఖర్‌గారితో ఎలా మాట్లాడి సంబంధం ఖాయం చేస్తాడు, అసలు ఆ అమ్మాయి ఏం చేస్తున్నది. బాబూరావు గారి అబ్బాయి వివరాలేంటి? వాళ్ళూ సంబంధం ఓకే చేసుకుంటారా? చేసుకోక ఏం చేస్తారు? ఈ సంబంధం తప్పితే మరొక సంబంధం దొరుకుతుందో లేదో! అలా వున్నాయి పరిస్థితులు... తరువాత సంగతులు నాకు తెలిసేదెలా? కథ పూర్తిగా తెలుసుకోకుండా నేను బస్సు దిగిపోవాల్సొస్తుందా?

ఈ సిగ్నల్స్ సరిగా వుండవెందుకు? జానీకి వాళ్ళ ఫోన్ కలిసినందుకు ఎంత సంబరపడిపోయాడో! సరిగా మాట్లాడకముందే లైన్ కట్టయిందే! ఆయన్ది ఏం నెట్వర్కో? పోనీ నా సెల్‌లో ప్రయత్నించమని చెబితే? నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది. “స్టాండ్ అసైడ్ అండ్ సీ ద ఫన్” అన్నారు ఒక స్వామీజీ. పక్కనుండి చూసి ఆస్వాదించాలి కానీ తలదూర్చి బొప్పికట్టించుకోకూడదు. సిగ్నల్ కోసం ఎదురుచూడ్డం తప్ప అటు జానీ గానీ, ఇటు నేను గానీ చెయ్యగలిగింది లేమీ లేదు. జానీ మళ్ళీ ట్రై చేస్తున్నాడో లేదో? పైకి లేచి దేనికోసమో వెనకి చూస్తున్నట్లు నటిస్తూ అతన్ని గమనించాను. సెల్ఫోన్‌ని చడామడా నొక్కేస్తున్నాడు.

హమ్మయ్య పర్వాలేదు. గురుడు డ్యూటీమీదనే ఉన్నాడు. అంతలోనే నా చెవులు పులకించాయి. జానీ సెల్ మోగింది. ఎక్కడినుంచో? ఆ మేడమ్ చేసిందా? లేక భర్తకు ఫోన్ చేసి ఆమె చెబితే ఆయన అదే శేఖర్ చేస్తున్నాడా? లేక బాబూరావా? మరెవరైనానా? జానీ గొంతు హుషారుగా పలుకుతోంది.

“బాబూరావుగారు! మొత్తానికి ఫోన్ దొరికింది. వాళ్ళ కోసమే వస్తున్నానని చెప్పా!... విషయమా? ఆ చెప్పలేదండి... ఇందాక అన్నాలే.. కానీ ఫోన్‌లో బావుండదుగా? రాత్రి తొమ్మిది, పదిలోపు మీకు తీపి కబురు చెబుతాగా! మరీ అవసరమనిపిస్తే నేనిక్కడే ఉంటా. మీరూ విజయవాడ నుండి వచ్చేయండి, అన్నీ విషయాలు మాట్లాడుకోవడమే కాదు, వీలైతే తాంబూలాలూ కూడా పుచ్చేసుకోవచ్చు.. ఆ.. నేను జోక్‌గా అనట్లేదండి.. ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు అలాగే జరుగుతున్నాయి.. మనమూ ఒక అడుగు ముందుండాలి. ఎంతో గాలిస్తే గానీ ఈ సంబంధం నాకు గుర్తుకురాలేదు. వదిలే ప్రశ్నే లేదు. నేను మళ్ళీ మీకు కాల్ చేస్తాను”

కాసేపటికి బస్సు నార్కట్ పల్లి చేరింది. జానీ కిందకి దిగాడు. బహుశా టీ తాగుతాడేమో! బస్సెక్కేలోపు ఎవరికైనా ఫోన్ చేస్తాడా? లేదా వాళ్ళ దగ్గరనుండి ఫోన్ వస్తుందా? మ్యాటర్ మిస్సయితే ఎలా? నాక్కూడా చాలా సేపు కూర్చొని కాళ్ళు నొప్పెడుతున్నాయి. బస్సు దిగి జానీ వెళ్ళినవైపు వెళ్ళాను. నేననుకున్నట్లే టీ స్టాల్ దగ్గరున్నాడు. నేనూ ఒక టీ తీసుకుని అటు తిరగి తాగటం మొదలెట్టాను. కానీ నా చెవులను మాత్రం జానీకి అప్పజెప్పాను.

నేను ఊహించినట్లే జానీ సెల్ మోగింది. “హలో! ఆ.. నార్కట్‌పల్లి దగ్గరున్నా.. శేఖర్‌గారు దొరకలేదు. వాళ్ళావిడ మాట్లాడింది. నీ గురించి అడిగింది. పని జరుగుతుందనే నా నమ్మకం. బాబూరావుగార్కి కూడా అదే చెప్పా! అవసరమైతే రెండు రోజులు వుంటాను కూడా! సరే.. సరే”

కాల్ జనార్ధన్ ఇంటినుండని నాకర్థమైంది.

కాసేపటికి అందరం బస్సెక్కాం. జనార్ధన్ వెనుకసీటు ఖాళీ అయింది. నాకు ఆయన వెనకగా వుండడం కొంత అసౌకర్యంగా ఉంది. ఆయన వెనుక నేను కూర్చుంటే బావుంటుంది. వెళ్ళి కూర్చున్నాను. జానీ కిటికీలోంచి చూస్తున్నాడు. పాపం ఎంతగా ఆలోచిస్తున్నాడో అనిపించింది. బస్సు రామోజీ ఫిల్మ్‌సిటీ దాటింది. నాకు అసహనంగా వుంది. ఒక్క ఫోనూ రాదే! పోనీ ఈయన చేయొచ్చుగా?

నా మనసులో మాట అతనికెలా తెలిసిందో, నెంబర్లు నొక్కి చెవులదగ్గర పెట్టుకున్నాడు. నేను అటెన్షన్‌లోకి వచ్చేశాను. ఈ సారి ఎవరికో? “హలో బాబూరావు గారు! అన్నట్లు అడగటం మరిచాను, కట్నాలు, కానుకలు లాంటివి ఏమైనా ఆశిస్తున్నారా? సందర్భం వస్తే చెప్పాల్సొస్తుంది.. ఆ.. అవును.. వెరీ గుడ్.. ఈ రోజుల్లో కట్నాలడిగితే అస్సలు సంబంధం కుదరకపోవచ్చు.. మీ నిర్ణయం బావుంది.. ఇక సంబంధం ఖాయమైనట్లే! ఎందుకంటే వాళ్ళ అమ్మాయికి మంచి సంబంధం చూడమని ఖమ్మంలో ఉండగా ఆయన నాకు రెండు మూడు సార్లు చెప్పారు కూడా. అమ్మాయి పేరు రాధిక. మీవాడి పేరు వేణుగోపాల్. భలే కలిశాయి కదూ? హలో.. హలో.. ఏదో

కాలొస్తున్నట్లుంది మీరు పెట్టేయండి, మళ్ళీ చేస్తాను"

"హలో శేఖర్ గారు! నమస్తే బావున్నారా?... అవును సెల్‌ఫోన్ మర్చిపోయారని మేడమ్‌గారు చెప్పారు. సిటీ దరిదాపుల్లోకి వచ్చాను. మరో అరగంటలో దిల్‌సుఖ్‌నగర్ చేరుతాను. మీరు బ్యాంకులోనే ఉన్నారుగా? అవునా? బెంగుళూరా? ఎప్పుడెళుతున్నారు... వెంటనేనా.. ఫ్లైట్‌లోనా.. ఇంటికి కూడా వెళ్ళడం లేదా? అంతర్జంటా? మరేం లేదు మీతో పర్సనల్‌గా మాట్లాడుదామని.. విషయమేమంటే... అదే .. మా స్నేహితుడి కుమారుడికి మీ అమ్మాయిని అడుగుదామని... మీరు ఖమ్మంలో ఉన్నప్పుడు మంచి సంబంధం వుంటే చెప్పమన్నారుగా? అప్పుడు తట్టలా.. మొన్ననే విజయవాడ నుండి నా స్నేహితుడు బాబూరావని రైస్‌మిల్లూ అదీ ఉన్నాయి... మంచి సంబంధం చూడమని అడిగాడు.. వెంటనే మీరు గుర్తుకొచ్చారు. మీ ఫోన్ ట్రై చేస్తే

దొరకలేదు. ఇందాకనే దొరికింది... మేడమ్ మాట్లాడారు. అబ్బాయి బెంగళూరులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. నెలకు అరవై వేల జీతం. మీరు బెంగళూరు వెళుతున్నారుగా. వీలైతే అబ్బాయిని మీరు కలవొచ్చు కూడా!

నవ్వుతున్నారేంటి సార్? నేను వినిపించుకోకుండా మాట్లాడుతున్నానా? భలేవారే! చెప్పండి.. అవునా? ఎప్పుడు? వారం క్రితమేనా? వచ్చేనెల పదో తారీకు పెళ్ళా? ఏ ఊరి సంబంధం? ... అవునా?.. ఓహో అలాగా? మంచిదండి. మనమేం చేస్తాం సార్.. ఎవరికి ఎక్కడ రాసిపెట్టుంటే అక్కడ. సారీ ఎందుకు సార్.. మీరలా అనుకోకండి.. సరే! మీరు బయలుదేరండి.. ఓకేనండి.. ఆ.. అదే అడ్రసు.. తప్పక వస్తాం.. వుంటాను"

కాసేపు నిశ్శబ్దం...

నాకు నీరసమొచ్చేసింది... ఇలా అయిందేమిటి? బాబూరావుగారికి అంత భరోసా ఇచ్చాడే మన జానీ. ఇప్పుడెలా? ఎల్.బి.నగర్ సర్కిల్ వచ్చింది. నేను దిగాను. జనార్థన్ కూడా దిగాడు. అదేమిటి ఇక్కడ దిగాడు? దిల్‌సుఖ్‌నగర్ పోడా? అవును ఇంకెందుకు? శేఖర్‌గారు బెంగళూరు వెళ్ళిపోయుంటారుగా?

రోడ్ దాటి ఇటువైపు వచ్చాను. నా తర్వాత బస్ వచ్చింది. ఎక్కుతూ మళ్ళీ జానీ కోసం చూశాను. అతనూ రోడ్డుకు ఇటువైపు వచ్చి కార్నర్లో ఉన్న ఇరానీ హోటల్‌లోకి వెళ్ళాడు. టీ తాగిన తర్వాత జానీ ఏం చేస్తాడు? తిరిగి ఖమ్మం బస్సు ఎక్కేస్తాడా?! మా అమ్మ చెప్పిన మరో మాట గుర్తొచ్చింది. "ఏ పనైనా చేసేటప్పుడు ఎక్కువ భరోసా పడిపోయి టాంటాం కొట్టుకోకూడదు.. ఒకవేళ ఆ పని కాకపోతే భంగపడాల్సొస్తుంది."

రచయిత సెల్ : 9849239945

మన మాణిక్యాలు ■

కొమురం భీం (1900- 1940)

నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ఆదివాసీ హక్కుల కోసం వీరోచిత పోరాటం చేసిన సమరయోధుడు కొమురం భీం. ఆదిలాబాద్ జిల్లా సంకెనపల్లి గ్రామంలో సోంబాయి, చిన్నూ దంపతులకు 1900 సంవత్సరంలో జన్మించాడు. 17 ఏళ్ళ వయసులో ఆదివాసీల పై దాడిలో తండ్రి చనిపోగా అతని కుటుంబం కెరిమెరి మండలం సర్దాపూర్‌కు తరలివెళ్ళింది. భీం సాగుచేసుకొంటున్న పొలాన్ని నిజాం జాగీర్దార్ సిద్దిఖీ ఆక్రమించటంతో అది సహించలేని భీం అతడిని వధించి చంద్రాపూర్ ఎదురుగా అస్సాంకు పారిపోయాడు. అక్కడి కాఫీ, తేయాకు తోటల్లో పని చేస్తూ మరాఠీ, ఉర్దూ భాషలను నేర్చుకున్నాడు. అయిదేళ్ళ తర్వాత తల్లి వుంటున్న కాకన్‌ఘాట్‌కు తిరిగివచ్చి సోంబాయిని పెళ్ళి చేసుకున్నాడు.

అస్సాంలో ఉన్నప్పుడు ఆదివాసీల స్వేచ్ఛకోసం జరుగుతున్న పోరాటాలను అవగాహన చేసుకొన్న భీం తన ప్రాంతంలోని గోండులు పడుతున్న బాధలనుంచి విముక్తి కలిగించటానికి 60 ఎకరాలను నరికి 12 గ్రామాలను ఏర్పాటు చేసి యువకులతో గెరిల్లా సైన్యం తయారు చేసి వారికి నాయకత్వం వహించాడు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీలను ఏకం చేసి నిజాం ప్రభుత్వాధికారులతో పోరుసల్పాడు. దీన్ని సహించలేని పోలీసులు భీం ఇంటిమీద దాడి చేసినా వారిని తిప్పి కొట్టారు. గిరిజనుల పోరాటానికి భయపడి అధికారులు చర్చలకు దిగి వచ్చినా గోండులకు స్వతంత్రరాజ్యం కావాలన్న భీం పట్టుదలతో అవి ఫలించలేదు. చివరికి కుర్దూ పటేల్ అన్న నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం సైన్యం గోండులను కాల్చి చంపారు. భీం వీరమరణం పొందిన 1940 సెప్టెంబర్ 1వ తేదీ ఆశ్వీజ శుద్ధ పౌర్ణమి కావటంతో అప్పట్నుంచీ ఆ పున్నమినాడు ఆదివాసీలు అతని వర్ధంతిని ప్రతిఏటా జరుపుకుంటున్నారు. ఆంధ్ర పాలనలో ఈ వర్ధంతి సభలపై ఆంక్షలుండేవి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారికంగా దీన్ని జరపటం ముదావహం. ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోనే కాక మన ట్యాంక్‌బండ్‌పై నెలకొన్న కొమురం భీం విగ్రహం అతని పోరాటస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిఉంది. భీం వీరగాథ నవలల్లోనే కాక వెండితెరపైకి ఎక్కడం అతని ప్రతిభను చాటుతుంది.

రంగారావు (1836-60)

ఆంధ్ర, మహారాష్ట్ర సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాలను గిరిజనులైన గోండులు సిర్పూరు, చంద్రాపూరు కేంద్రాలుగా పాలించేవారు (1240-1750). గోండ్వానా ప్రాంతాన్ని 1750లో మరాఠీలు ఆక్రమించుకోగా 1802 తర్వాత అది బ్రిటీష్ ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ఆంగ్ల ప్రభుత్వ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా 1836-1860 మధ్య కాలంలో ఆసిఫాబాద్ కేంద్రంగా గోండులు బ్రిటీష్ సైన్యాలతో పోరు సల్పారు. వారికి తోడుగా మహారాష్ట్రలో (ఔరంగాబాద్, బీదర్) రోహిల్లా సిపాయిలు రంగారావు నేతృత్వంలో ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించి పోరాటం సల్పారు. రంగారావు ఆంగ్లేయులకు పట్టుబడి అండమాన్ జైలులో యావజ్జీవ కారాగారశిక్షను అనుభవిస్తూ 1860లో మరణించాడు.

- ఎస్వీ రామారావు

రికీ కేజ్

ఫిబ్రవరి 8 వ తేదీన అమెరికాలో ఆర్భాటంగా జరిగిన గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఇద్దరు భారతీయులు తళుక్కున మెరిశారు. ఎప్పుడూ లేని విధంగా ఒకే ఏడాది ఇద్దరు భారత జాతీయులకు సంగీతంలో ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు రావటం కోట్లాది మంది భారతీయులను ఆనందపరిచింది. అవార్డు విజేతలిద్దరూ నిజానికి వృత్తిగతంగా సంగీత విద్వాంసులేం కారు. ఒకరు దంత వైద్యుడు కాగా మరొకరు కథా రచయిత్రి.

నీలా వశ్వానీ

కల నిజమయింది

నాన్న డాక్టర్. కొడుకేమో చదువు కన్నా మ్యూజిక్‌పై మక్కువ చూపుతున్నాడు. ఇది చూసి తండ్రి సంగీతం కూడుపెట్టదురా బుద్ధిగా చదువుకోమన్నాడు. అలా చేస్తే నాలా పెద్ద డాక్టరువవుతావన్నాడు. సరే డాక్టరైన తరువాతన్నా సంగీతం నేర్పిస్తావా అని అడిగాడు కొడుకు. ఓ ఎస్ అన్నాడు నాన్న. తండ్రికిచ్చిన మాట ప్రకారం వైద్యవిద్యనభ్యసించాడు పుత్రరత్నం. డాక్టరయ్యాడే కానీ ఒక్కరికీ వైద్యం చెయ్యలేదు. సంగీతం నేర్చుకుని గొప్ప సంగీత విద్వాంసుడయ్యాడు. సామాన్యులకు అసాధ్యమైన గ్రామీ అవార్డు గెలుచుకున్నాడు. అతగాడి పేరే రికీ కేజ్.

కేజ్ అమెరికాలో పుట్టాడు. ఆ విధంగా అతగాడు అమెరికా పౌరసత్వం పొందాడు. తల్లిపంజాబీ కాగా తండ్రి మార్వారీ. ఎనిమిదేళ్ల వయసులో తల్లిదండ్రులతో కలిసి బెంగుళూరు వచ్చేసి విద్యాభ్యాసం కొనసాగించాడు. అయితే చిన్నప్పటి నుంచి అతగాడికి సంగీతం అంటే ప్రాణం. ఏదో హాబీగా సంగీతం నేర్చుకోడటం ప్రారంభించాడు. గిటార్, కీబోర్డ్ వాయిస్తూ ఉండేవాడు. ఇతరుల్ని స్నేహితులుగా మార్చుకోవటానికి మ్యూజిక్ నేర్చుకోవటం ప్రారంభించానని అప్పటి సంగతులను ముసిముసినవ్వులతో చెబుతున్నాడు. డాక్టరైన తండ్రి సంగీతం పట్ల కేజ్ పెంచుకుంటున్న ఆసక్తిని చూసి కంగారు పడ్డాడు. తన కొడుకు తనలాగే డాక్టరై నాలుగు చేతులా సంపాదించాలనేది ఆయన కోరిక. సంగీతంలో కెరీర్ ఎదుగుదల ఉండదని ఆయన భావించాడు. అందుకే కొడుకు సంగీతం నేర్చుకుంటానంటే అడ్డుచెప్పాడు. హైస్కూల్ విద్య తరువాత తండ్రితో ఒక ఒప్పందానికి వచ్చాడు కేజ్. తండ్రి కోరిక ప్రకారం దంతవైద్య విద్యను అభ్యసిస్తానని... ఆ తరువాత తనకు సంగీతం నేర్చుకునే అవకాశం కల్పించాలని కోరాడు. అందుకు తండ్రి సరేనన్నాడు. దంత వైద్యవిద్యలో ప్రవేశించాడే కానీ తన మనసంతా సంగీతంవైపే లాగుతోంది. అందుకే వైద్యకళాశాలలో ఉన్న నాలుగేళ్ళు కొంత సమయాన్ని మ్యూజిక్‌కి కూడా కేటాయించాడు. అనేక మ్యూజిక్ స్టూడియోల చుట్టూ తిరుగుతూ ఈ నాలుగేళ్లలో చదువు కొనసాగిస్తూనే దాదాపు వెయ్యికి పైగా వ్యాపార ప్రకటనలకు మ్యూజిక్ సమకూర్చాడు. కాలేజికి వెళ్ళి చదువుకునే పనిలేకుండా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగువరకు సంగీతాన్ని నేర్చుకుని ఉంటే తాను ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించి ఉండేవాడినని అతగాడు అంటున్నాడు. తండ్రికిచ్చిన మాట ప్రకారం దంతవైద్యంలో పట్టా పొందాడే కానీ ఒక్కరికి కూడా వైద్యం చెయ్యలేదు. ఆకలిగొన్న పులిలా సంగీత సాధనపై పడ్డాడు.



ఛాలెంజెస్

మొదట్లో రేడియో వ్యాపార ప్రకటనల కోసం జింగిల్స్ కంపోజ్ చేసేవాడు. తరువాత టీవీ వ్యాపార ప్రకటనలకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను ఇవ్వటమూ ప్రారంభించాడు. అలా ప్రారంభించిన కేజ్ ఇప్పటికి సుమారు మూడువేలకు పైగా ట్యూన్స్‌ను సమకూర్చాడు. కొన్ని కన్నడ సినిమాలకు సంగీత దర్శకత్వమూ వహించాడు. అయితే తన మ్యూజిక్‌కు ఇండియా అనువైన చోటు కాదని అతగాడంటాడు. గుండె లోతుల్లో నుంచి వచ్చే సంగీతానికి ఇక్కడ ఆదరణ తక్కువనేది అతడి అభిప్రాయం. మన సినిమా పాటలన్నీ సినిమా పాత్రల తత్వంపైనే ఆధారపడి ఉంటాయి. అందువల్ల మనల్ని మనం ఆవిష్కరించుకొనే అవకాశం భారతీయ సినీ సంగీతంలో తక్కువ అనేది అతడి నమ్మకం.. అలాగని తాను బాలీవుడ్ సినిమాలకు సంగీతం అందించటానికి విముఖుణ్ణి కానని అంటున్నాడు. అవకాశం వస్తే హిందీ సినిమాలకు సంగీతం సమకూర్చుతానని ప్రకటించాడు ఈ 33 ఏళ్ల యువ మ్యూజిషియన్.

విండ్స్ ఆఫ్ సంసారా

తన జింగిల్స్‌కు వచ్చిన ఆదరణ చూసి 2003లో మొదటి సారిగా

'కమ్యునికేటివ్ ఆర్ట్ లాంజ్ ఫ్రం బే' అనే ఆల్బమ్ ను విడుదల చేశాడు.అనూహ్యస్పందన వచ్చింది దానికి. ఇక వెనక్కి తిరిగి చూడలేదు కెజ్. అదే ఊపు మీద మరో 12 ఆల్బమ్‌లు ఒక దాని తరువాత ఒకటిగా చేసుకుంటూ పోయాడు. అన్నీ హిట్లే. తరువాత వినూత్నంగా మరో ఆల్బమ్ ను విడుదల చెయ్యాలని తలంచాడు జెక్. ఇందుకోసం దక్షిణాఫ్రికా ఫ్లూట్ విద్వాంసుడు వౌటర్ కెల్లర్మాన్‌తో జత కలిశాడు. ఆయనతో కలిసి దాదాపు ప్రపంచమంతా తిరిగి అనేకమంది సంగీతకారులను కలిశాడు.అలా మూడేళ్ళు కష్టపడి 120 మంది సంగీత విద్వాంసుల సహకారంతో 'విండ్స్ ఆఫ్ సంసారా' అనే ఆల్బమ్ రూపొందించాడు. ఆల్బమ్ రూపకల్పనలో ఎంత ఎక్కువ మంది పాల్గొంటే అంత అద్భుతంగా ఆల్బమ్ రూపొందుతుందనేది అతడి అభిప్రాయం. 'విండ్స్ ఆఫ్ సంసారా' ప్రపంచ శాంతిని, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని, దక్షిణాఫ్రికా, భారత దేశాల మధ్య మహాత్మా గాంధీ నుంచి నెల్సన్ మండేలా వరకు ఉన్న సంగీత, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను ప్రతిబింబిస్తుందని అతడంటున్నాడు. తాను మహాత్మా గాంధీ చే ప్రభావితుడై నట్లే నెల్సన్ మండేలా నుంచి వౌటర్ స్ఫూర్తి పొందాడని, అందువల్లే ఇద్దరం అద్భుతంగా తమ సంస్కృతులను ట్రాక్స్‌పైకి తీసుకురాగలిగామని ఆనందపడుతున్నాడు. ఆల్బమ్ విడుదలైన తరువాత అమ్మకాల్లో సంచలనం సృష్టించింది. 2014 జులైలో విడుదలై 2015 వచ్చేనాటికి గ్రామీ అవార్డును తెచ్చిపెట్టింది.

సంగీతంలో అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవార్డు గ్రామీ. ఈ అవార్డును అనేక విభాగాల్లో ఇస్తారు. రికీ కెజ్‌కి న్యూ ఏజ్ విభాగంలో ఈ అవార్డు వచ్చింది. గ్రామీ అవార్డు వస్తుందని తను అనుకోలేదు. అవార్డు విజేతగా తనపేరును పిలిచినప్పుడు విస్మయం చెందానని, అందుకే సాధ్యం కాని కల నిజమైన అనుభూతికి గురయ్యానని తన అనుభూతిని వ్యక్తం చేశాడు.

పిల్లలు వద్దనుకుని...

కెజ్ భార్య కూడా సంగీత ప్రియురాలే. ఆమె కూడా అద్భుతంగా సితార్ వాయిస్తుంది. ఇద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటారు. సాధ్యమైనంతవరకు ఇద్దరు కలిసి సమయం గడపటానికి ప్రయత్నిస్తారు. అలాగే పిల్లల్ని కనకూడదని కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు అనాథ పిల్లల కోసం పాటుపడాలని భీష్మించుకున్నారు. ముందు ముందు ఎవరినన్నా దత్తత తీసుకునే ఆలోచనా ఉందని కెజ్ చెబుతున్నాడు. కెజ్ చాలా టీవీ పాటల రియాల్టీ షోలకు జడ్జిగా వ్యవహరించాడు. అంతే కాదు సంగీత విద్య, జంతు హక్కుల కోసం ఎంతో శ్రమిస్తున్నాడు. యువ కళాకారుల కళాఖండాలు వివిధ ఆర్ట్ గ్యాలరీల్లో ప్రదర్శనకు నోచుకోవడానికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నాడు. అతడు మజోలీ మ్యూజిక్ ట్రస్ట్‌ను స్థాపించినవారిలో ఒకడు. భారతదేశంలో సంగీత విద్యలో ప్రామాణికతను నెలకొల్పటం, వృద్ధాప్యంలో ఉండి ఆర్థిక ఇబ్బందులు పడే కళాకారులకు ధనసహాయం చెయ్యటానికి ఒక ఫండ్‌ని ఏర్పాటు చెయ్యటం ఈ ట్రస్ట్ ఏర్పాటులోని ముఖ్య ఉద్దేశాలు. అలాగే 'ప్రోజెక్ట్ పీస్ ఆన్ ఎర్త్' కి రాయబారిగానూ కెజ్ ఉన్నాడు. ఆవిధంగా భారత దేశం నుంచి మొదటి సంగీత రాయబారిగా పేరుతెచ్చుకున్నాడు.

నీలా వశ్వానీ

నీలా వశ్వానీ కూడా గ్రామీ అవార్డు గెలుచుకుంది. నిజానికి ఆమె సంగీతకారిణి కాదు. ఓ రచయిత్రి. కొన్ని చిన్న కథల సంపుటాలను ఆమె వెలువరించారు. ఐతే పాకిస్థాన్ ఆడపిల్లల చదువుకునే హక్కు కోసం పోరాడుతున్న బాలిక మలాలా యూసఫ్ జాయ్ జీవిత కథకు ధ్వని రూపం ఇచ్చారామె. ఆమె సమకూర్చిన ఆడియో ఆల్బమ్ పేరు 'ఐ యామ్ మలాలా'. మలాలా జీవిత

చరిత్రను హృద్యంగంగా చదివి ఆల్బమ్‌ను విడుదల చేసింది. ఇది 'ఉత్తమ పిల్లల ఆల్బమ్' విభాగంలో విజేతగా నిలిచింది. ఇక ఆమె వ్యక్తిగత జీవితం గురించి చూస్తే.. ఆమె తల్లి ఐర్లాండ్ జాతీయురాలుకాగా తండ్రి భారతీయుడు (సింధి). ఆమెకు 18 ఏళ్ళు వచ్చేటప్పటికి ఆమె కుటుంబం 13 ఇళ్లు మారింది. 25 దేశాలు తిరిగింది. ఫలితంగా ఆమెకు రకరకాల మనుషులను, సంస్కృతులను చూసే అవకాశం వచ్చింది. ఈ అనుభవంతోనే ఆమె అనేక కథలు రాశారు. అనేక అవార్డులు, మెడల్స్ కూడా పొందారు. చిన్నప్పటి నుంచి స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి. అందుకే లెక్కకు మించిన చిన్న చిన్న పనులు, ఉద్యోగాలు చేసి చదువుకుంది. ఓ బార్‌లో వెయిట్రెస్‌గా పనిచేసి స్కూల్ ఫీజు కట్టుకోవటం చూస్తే ఆమె వ్యక్తిత్వం ఎటువంటిదో మనకు అర్థమవుతుంది. ప్రస్తుతం ఈమె అమెరికాలోనే నివసిస్తోంది. కానీ ఇండియాలోనూ, అమెరికాలోనూ విద్యాకార్యకర్తగా అనేక కార్యక్రమాలు చేపడుతోంది.

- ఎస్సార్కె

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20



నెమ

పరమానందయ్య శిష్యులు



పరమానందయ్య గారికి పన్నెండు మంది శిష్యులు. ఒక రోజు పరమానందయ్య ఊరికి పోవాలని ఎద్దుల బండిలో బయల్దేరారు. పన్నెండుమంది శిష్యులు బండి వెనకాల నడవసాగారు. వెనుక వస్తున్న శిష్యులతో బండిలోనుండి కింద ఏమైనా పడిపోతాయేమో చూడండి అని చెప్పాడు. సనేనన్నారు శిష్యులు.

కొద్ది సేపటికి పరమానందయ్య మరచెంబు కింద పడిపోయింది. దాన్ని చూస్తూ ఉన్నారు కానీ కింద పడ్డ మరచెంబును తీయలేదు. మరికాసేపటికి కండువా కింద పడింది. దాన్ని కూడా చూస్తూ వస్తున్నారు కానీ తీయలేదు. దాంతో పరమానందయ్యకి కోపం వచ్చింది.

తన శిష్యులతో “ఓరి బడుద్దాయిల్లారా! కింద మరచెంబు, కండువా పడిపోతే చూస్తూ ఊరుకుంటారేంట్రా?” అన్నారు.

దానికి శిష్యులంతా “మీరే కందండి... కింద ఏమైనా పడిపోతాయేమోనని చూడమన్నారు. అందుకే చూస్తున్నాం” అన్నారు.

“నేను చెప్పిందానికి అర్థం మీరు చూస్తూ ఉండమని కాదు, కింద ఏమైనా పడిపోతే దాన్ని తీసి తిరిగి బండిలో వేయమని. ఈ సారి బండిలోనుండి ఏం కిందపడ్డా తిరిగి బండిలో వెయ్యండి” అన్నాడు పరమానందయ్య.

ఇంకొద్ది సేపటి తర్వాత ఎద్దు పేడ వేసింది. గురువుగారు బండిలోనుండి కింద ఏం పడ్డా తిరిగి బండిలో వేయమని చెప్పారుగా. దీన్ని కూడా బండిలో వేద్దాం అని పేడని తీసుకుని బండిలోకి విసిరేశారు శిష్యులు. ఆ పేడ వెళ్ళి గురువుగారి ముఖానికి తగిలింది. పరమానందయ్యకి ఇంకా కోపం పెరిగిపోయి, వాళ్ళందరి వీపు మీద విమానం మోత మోగించారు.

కనిపెట్టండి

ఇందులో కిందున్న వస్తువులు దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి.

శాంతి స్వరూప్ భట్నాగర్

ప్రసిద్ధి గాంచిన భారతీయ శాస్త్రవేత్తలలో శాంతి స్వరూప్ భట్నాగర్ ఒకరు. శాంతి స్వరూప్ ఒకప్పటి షాపూర్‌లో (ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉంది) 1894, ఫిబ్రవరి 21న జన్మించారు. చిన్నప్పటి నుండి బొమ్మలు, యంత్ర పరికరాలు తయారు చేయడంలో ఆసక్తి చూపించేవారు. ఈయన్ని భారత పరిశోధన శాలల పితామహుడు అంటారు. ఎందుకంటే భారతదేశంలోని శాస్త్ర, సాంకేతిక పరిశోధనా విభాగాలు అన్నీ ఒక్క గొడుగుకింద పని చేస్తున్నాయంటే అది భట్నాగర్ కృషి ఫలితమే. శాంతి స్వరూప్ పరిశోధన చేసిన వాటిలో మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో తెలియజేశాడు. కిరోసిన్‌ను శుద్ధి చేయడం, ఆదా చేయడం గురించి ఈయన ఎంతో విలువైన సమాచారాన్ని అందించాడు. పెట్రోలియం నుండి విడుదలయ్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో ఈయన పరిశోధించాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్, రబ్బరు వస్తువులను తయారు చేయటం వంటివి ఎన్నో చేశాడు. పరిశ్రమలకు, శాస్త్ర పరిశోధన ఫలితాలకు ఒక సయోధ్య కుదిర్చిన శాంతి స్వరూప్ భట్నాగర్ యు.జి.సి.కి మొదటి అధ్యక్షుడుగా పని చేశారు. నువ్వు పని చేయడమే కాదు, పని చేసే అవకాశాల్ని కల్పించు అనే సిద్ధాంతాన్ని నమ్మే ఈయన 1995, జనవరి 1 న ఢిల్లీలో మరణించారు. వివిధ రంగాల్లో శాస్త్ర, సాంకేతిక ప్రతిభను కనబరిచిన శాస్త్రవేత్తలకు, వారి సేవలకు గుర్తింపుగా శాంతి స్వరూప్ భట్నాగర్ పేరుమీద ప్రతి సంవత్సరం అవార్డులు ఇస్తారు. ఇవి భారత శాస్త్రరంగంలో అత్యున్నతమైనవిగా పరిగణిస్తారు.



ీక





తేడాలు

ండు బొమ్మల మధ్య 10 తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించండి.



సరిగ్గా...

ఈ జంతువు భాగాలన్నీ విడిపోయి చెల్లాచెదురై పోయాయి. వాటిని యథాస్థానంలో పెట్టండి.



దారేది?

ఈ ఎలుగుబంటి తన ఇంటికి వెళ్ళే దారేది?

మూపురమే రక్షణ

- ఒంటెల్లో రెండు రకాల జాతులున్నాయి.
- ఒంటెల శరీరం మందంగా ఉండి ఎడారి జీవనానికి అనుకూలంగా వుంటుంది.
- ఇసుకలో నడిచేటప్పుడు దిగబడిపోకుండా వీటి పాదాల కింది భాగం దిండులా మందంగా వుంటుంది.
- ఒంటెలు నీళ్ళు తాగకుండా రెండు నెలల వరకు ఉండగలవు.
- పదమూడు నిముషాల్లో 30 గాలన్ల నీటిని (113 లీటర్ల నీటిని) తాగేస్తాయి.
- ఆ నీటినే కడుపులో నిల్వ చేసుకుని నీటి ఎద్దడిని తట్టుకుంటాయి.
- ఒంటె ఎంత వేడిని, ఉష్ణోగ్రతనైనా భరించగలవనుకుంటారు. కానీ అది నిజం కాదు.
- ఒంటె మూపురంలో అత్యధిక మోతాదులో కొవ్వు ఉంటుంది. ఇది బయటి వేడిని శరీరంలోకి రాకుండా అడ్డుకుంటుంది.
- దీన్ని వేటాడ్డం ఎంత పెద్ద జంతువుకైనా కష్టమే. ఎందుకంటే దీని కాళ్ళు చాలా బలంగా వుంటాయి. నాలుగు కాళ్ళు ఒకేసారి ఎత్తి తన్నగలదు.
- ఒంటెల కను రెప్పలు రెండు పొరలుగా వుండి కళ్ళను కాపాడతాయి. అందుకే ఎంత పెద్ద ఇసుక తుఫాన్లు వచ్చినా స్పష్టంగా చూడగలుగుతాయి.
- ముక్కు రంధ్రాల నిర్మాణం కూడా అవసరాన్ని బట్టి మూసుకుపోతాయి కాబట్టి శ్వాసకు సంబంధించి కూడా ఎడారుల్లో వాటికి ఇబ్బంది వుండదు.
- వీటి మీదకి శత్రువులు దాడి చేసినప్పుడు అవి వెంటనే ఉమ్మేస్తాయి. వాటి లాలాజలంలో ఉండే చిక్కటి ఆకుపచ్చని ద్రవం జిగురుగా, దుర్వాసనతో ఉంటుంది. దాన్ని భరించడం, వదిలించుకోవడం చాలా కష్టం.





■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గత వారం తరువాయి)

పొగమంచు దట్టంగా అలుముకుని, సూర్యుడు కనిపించని కాలంలో లండన్‌కు చేరుకున్నారు మార్క్స్ దంపతులు. మిట్ట మధ్యాహ్నం కూడా చీకటిగా వుంటుంది. వీధుల్లో అక్కడక్కడా పచ్చటి గ్యాస్‌లైట్లు వెలుగుతుంటాయి. లేదా, డబ్బులిస్తే, పిల్లలు లాంతర్లతో కాసేపు దారి చూపుతారు. "పొగమంచు ఎలా వుందంటే. మీరో మనిషితో కరచాలనం చేసినా అతని ముఖం మాత్రం చూడలేరు". ఈ పగటి చీకటికి తోడు భరించలేని దుర్గంధం.

బళ్లు లాగటానికి వేలాది గుర్రాలు లండన్ వీధుల్లో తిరుగుతుంటాయి. సహజంగానే వందల టన్నుల పేడ కూడా పేరుకుపోతుంటుంది. భవనాల్లోకి సెల్లార్లలోకి వీళ్ల వదిలిన మలమూత్రాలు కూడా వీధుల్లోకే వచ్చి చేరతాయి. జనసాంద్రత ఎక్కువగా వున్న లెస్టెండ్, సోహో వంటి ప్రదేశాల్లోని మరుగుదొడ్లలో మూడు అడుగుల పాటు పేరుకుపోయి వుంటాయి వ్యర్థాలు. జెన్నీ లండన్‌కు చేరిన సమయంలో ఈ వ్యర్థాలను థేమ్స్ నదిలోకి వదలటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాని దీనివల్ల సమస్య తీరలేదు సరికదా మరింత జటిలమైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పోవటం వల్ల, ప్రతిసారీ ఆటుపోటులతో పాటు మురికి వీధుల్లోకి ప్రవహించాలి. దీని వల్ల వ్యాపించింది దుర్గంధమే కాదు, వ్యాధులు కూడా. పైగా లెస్టర్ స్క్వేర్, సోహోలాలలో వుండేది నిరుపేదలే, కలుగుల్లో ఎలుకల్లా.

తను ప్రారంభించిన పోరాటానికి హేతుబద్ధమైన ముగింపు సాధించటానికే ప్రయత్నించాడు మార్క్స్. మరో తిరుగుబాటు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈసారి, తిరుగుబాటుకు నాయకత్వం వహించేది పెటీ బూర్జువా వర్గం, చిన్న దుకాణదార్లు, వ్యాపారస్తులు, చిరుద్యోగులు వగైరా... బడా బూర్జువా వర్గం వీళ్లను దారుణంగా దోచుకుంటున్నది.

1845 తర్వాత, బంగాళా దుంప తెగులు ఫలితంగా కలిగిన ఆర్థిక సంక్షోభంతో వలసవచ్చిన వేలాది మంది శరణార్థులు లెస్టెండ్, సోహోలాలోనే తలదాచుకున్నారు. దేశదేశాలు నుండి వచ్చిన వారితో ఇక్కడ చిన్న చిన్న ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఐరిష్ కాలనీలు ఏర్పడ్డాయి. అక్కడ ఎవరూ ఇంగ్లీషు మాట్లాడవలసిన అవసరం లేదు. తమదేశ సంప్రదాయాలనే పాటించవచ్చు. అయితే, అక్కడ కూడా, పాతవాళ్లు కొత్తగా వచ్చినవాళ్లను దోపిడీ చేస్తారు. ఎక్కువ అద్దెలు డిమాండ్ చేస్తారు. వెంట తెచ్చుకున్నది కొద్దోగొప్పో ఏమైనా వుంటే కాజేస్తారు. అలా, కొత్తగా వచ్చిన శరణార్థులు రోడ్డునపడ్డారు. కాని లండన్ వీధులు ఎంత రద్దీగా వుంటాయంటే, అడ్డం వచ్చిన వాళ్లను లాక్కుంటూనైనా ముందుకు పోతారు గాని నడక వేగం తగ్గించరెవరూ. చివరికి సందుల్లో, గొందుల్లో, ఎక్కడ కాసింత చోటు దొరికితే అక్కడ తలదాచుకోవటంతో చివరికి ఆ సందులు, గొందులు కూడా నగరంలోని మరో నగరంగా మారాయి. అక్కడ లండన్‌తో సంబంధం వుండదు. వాళ్ల చట్టాలు వాళ్లవే. వాళ్లే న్యాయం చెప్పుకుంటారు.

సహజంగానే, లెస్టర్ స్క్వేర్‌లో వందలాది మద్య శాలలు వెలిశాయి. జేబులో షిల్లింగు వున్న అదృష్టవంతుడికి అక్కడో గ్లాసు 'మనశ్శాంతి' దొరుకుతుంది. కాని పాముల్లా మెలికలు తిరిగిన ఆ సందులు, చీకటి సొరంగాల్లాంటి మద్యశాలలు ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఆ సందుల్లో బంగాళాదుంపలు, కాఫీ, వేయించిన చేపలు, బఠానీ సూపు, మిఠాయి, రకరకాల

పళ్లు, కాయలు అమ్ముతారు. బూతు పుస్తకాలు అమ్మేవాళ్లు అందులో వున్నది లేనిది కల్పించి జనాన్ని ఆకర్షిస్తారు. కవులూ, నాటకాలు రాసేవాళ్లూ, జాలిగొలిపేటట్టుగా తమ కావ్యాలు గానం చేస్తూ చేతులు జాస్తారు. ముఖ్యంగా ఇటాలియన్ కుర్రాళ్లు వీళ్లందర్నీ మించిపోయారు. ఓ కోతినో, ఎలుకనో పట్టుకొని ఆడిస్తూ ఇటాలియన్ సంగీతకారుల్ని అనుకరిస్తూ పాడి డబ్బులడుక్కుంటారు. ఈ డబ్బులన్నీ వాళ్ల గ్యాంగ్ లీడర్‌కిస్తే తప్ప వాళ్లు క్షేమంగా బతకలేరు.

లెస్టర్‌స్క్వేర్‌లో ఇదీ జెన్నీ చుట్టూ వున్న వాతావరణం. అందరూ ముష్టివాళ్లే. ఆకలికో, ఆ హింసలు భరించలేకనో పిచ్చెక్కి అరుస్తున్నారు కొందరు. అది జీవిత సమరాంగణం. అదే ఆమె కొత్త నివాసం.

దేశాంతర వాసానికి వచ్చిన అనేకమంది లాగా, మార్క్స్ కూడా ఉత్సాహంగా పొంగిపోతున్నాడు. గత సంవత్సరం జరిగిన ఆందోళనలు, తిరుగుబాట్లు, విప్లవాలు యూరోపు ముఖ చిత్రాన్నే మార్చివేశాయి. రాజులు, ధనమదాంధుల కారణంగా విప్లవం వీగిపోయినందుకు ఆయనపై పట్టుదల పెరిగిందే తప్ప ఇసుమంతైనా తగ్గలేదు. పరాజయంతో, మధ్యతరగతి కొద్దిగా లాభపడింది. వ్యాపారస్తులకు తాయిలాలు లభించాయి గాని కార్మికుల స్థితి కనాకష్టంగా మారింది. ఫ్యాక్టరీలతో వస్తువులను ఉత్పత్తి చేసి యజమానులకు లాభాలార్జించి పెడుతున్న చేతులు హక్కుల సాధనలో మాత్రం నిర్వీర్యమవుతున్నాయి. రాజకీయ అధికారం లేదు గనుక కార్మికుడి ఉనికినే ఎవరూ గుర్తించరు. గుర్తిస్తే "వ్యవస్థకే అతడో ప్రమాదకరమైన వ్యక్తి. తిరుగుబాట్లు చేస్తాడు. బారికేడ్లు నిర్మిస్తాడు" అంటారు.

తను ప్రారంభించిన పోరాటానికి హేతుబద్ధమైన ముగింపు సాధించటానికే ప్రయత్నించాడు మార్క్స్. మరో తిరుగుబాటు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈసారి, తిరుగుబాటుకు నాయకత్వం వహించేది పెటీ బూర్జువా వర్గం, చిన్న దుకాణదార్లు, వ్యాపారస్తులు, చిరుద్యోగులు వగైరా... బడా బూర్జువా వర్గం వీళ్లను దారుణంగా దోచుకుంటున్నది. మొన్నటి విప్లవ పరాజయంతో లాభపడింది తిమింగలాలే తప్ప చిన్న చేపలు కాదు. తిరుగుబాటు చేసే క్రమంలో పెటీబూర్జువాలు, కార్మికుల సహాయం తీసుకుంటారు. ఇద్దరూ కలిస్తేనే తప్ప అధికార వర్గాన్ని బంధించటం సాధ్యంకాదు. ఇవి అనివార్యం. కాని ఈ కలయిక తాత్కాలికమే. "మా లక్ష్యం ప్రైవేటు ఆస్తులు చేతులు మారటం కాదు. ప్రైవేటు ఆస్తి రద్దు కావాలి. వైషమ్యాలు తొలగి వర్గసామరస్యం సాధించటం కాదు. వర్గరహిత సమాజం కావాలి. ప్రస్తుత సమాజానికి మెరుగులు దిద్దటం కాదు. దీని పునాదుల మీద కొత్త సమాజం ఆవిర్భవించాలి".

కాని, ఇంగ్లండులో వుంటూ యూరోప్‌లోని కార్మికులను సమాయత్తం చెయ్యటమెలా? అక్కడ సామాజిక భూకంపం సృష్టించటమెలా? ఈ పనికోసం ఒక సంస్థ, ఒక పత్రిక అవసరముంటుంది. కార్మికుల్లో నమ్మకం పెంచటానికి ఒక కార్యక్రమం రూపొందించాలి. అలా మార్క్స్ మళ్లీ రాజకీయ కార్యక్రమాలు ప్రారంభించాడు. పాత కమ్యూనిస్టు లీగ్‌తో సంబంధాలు పునరుద్ధరించుకున్నాడు. "శరణార్థుల సహాయ కమిటీ" పేర ఒక సంస్థను ప్రారంభించటానికి సహాయం చేశాడు. అయితే మార్క్స్ మనసంతా పత్రిక మీదే వుంది. ఎనభై పేజీలతో జర్మన్ మాస పత్రిక ప్రారంభించి, దాన్ని క్రమంగా వారపత్రికగా, దినపత్రికగా మార్చాలి. యూరోపులో దీనికి బాగా ప్రచారం లభిస్తుంది. అంతకన్నా ముఖ్యంగా, 'శత్రు దేశం

జర్మనీ' లో అందరూ చదువుతారు. లండన్ నుండి స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తపరచటం ద్వారా, యూరోపులోని రియాక్షనరీ ప్రభుత్వాల మీద ఒత్తిడి పెరుగుతుంది. స్థానికంగా నిరసన తెలపలేని వాళ్ల చేతిలో ఆయుధంగా మారుతుంది.

అయితే తన దగ్గర, లీగ్ సభ్యుల వద్ద పత్రిక కోసం పెట్టుబడి పెట్టగలిగినంత డబ్బులేదు. అందరూ తనలాగే శరణార్థులు. కాని ఎలాగోలా దొరక్కపోతుందా అని ఆశ. పత్రిక ప్రారంభించటమంటూ జరిగితే, తొలి రోజులే కాస్త ఇబ్బందిగా వుంటాయి. ఈ లోగా జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కోసం "బూర్జువా ఆస్తి అంటే ఏమిటి?" అనబడే ఉపన్యాసాల పరంపర ప్రారంభించాడు. ఈ ఉపన్యాసాలు జనాన్ని బాగా ఆకట్టుకుంటే వాటినే పత్రికలో పునర్ముద్రించవచ్చు.

ముప్పైరెండేళ్లొచ్చాయి. సరిగ్గా యూనివర్సిటీ ప్రొఫెసర్‌లాగే ఉన్నాడిప్పుడు. మోకాళ్ల దాకా లాంగ్‌కోట్ వేసుకుంటాడు. మెడలో స్కార్ఫ్. దువ్వని నల్లని జుత్తు, అక్కడక్కడా నెరుస్తున్నది గడ్డం. కళ్లద్దాలు లేవుగాని కుడికంటిలో లెన్సు పెట్టుకుంటాడు. ఓపిగ్గా బ్లాక్‌బోర్డు మీద రాస్తూ ఫార్ములాలను, సిద్ధాంతాలను వివరిస్తాడు. భవిష్యత్తులో, పెట్టుబడిగా అందరికీ తెలిసిన మహాగ్రంథానికి పేరుస్తున్న ఇటుకలవి. ఆయన విద్యార్థులంతా సహచరులే, కాకపోతే వయసులో కొద్దిగా చిన్నవాళ్లు. అందరూ

వృత్తిపనివాళ్లు. మేధావులు సభ్యత్వ నమోదుకు లీగ్ ఆశించిన 'కార్మికులు' కాదు. వీళ్లంతా కొత్తగా వచ్చిన శరణార్థుల్లో దండిగా వున్నారు. మధ్యాహ్నమంతా నగరంలో వీధివీధికీ తిరిగి విరాళాలు పోగుచేసి, ఎంతోకొంత సహాయం చేసి వాళ్ల నమ్మకం పొందటానికి ప్రయత్నించాడు మార్క్స్.

అయితే, ఆ సమయంలో విరాళాల సేకరణలో కూడా పోటీ తీవ్రంగా వుంది. 1848లో డజన్ల కొద్దీ నాయకులు శరణార్థులకోసం పాటుపడతామన్నారు. అందరికీ విరాళాలు కావాలి. పరువు ప్రతిష్ఠలు కావాలి. రాజకీయ అధికారం కావాలి. ఈ వ్యవహారాల్లో జర్మన్‌లకు పట్టపగ్గాలేవు. తమతో తాము కలహించుకుంటారు. ఇతర్లతోనూ పోట్లాడతారు.

ఈ ఫ్యాక్షన్ నాయకులందరూ తమను తాము రాబోయే విప్లవానికి నాయకులుగా వూహించుకున్నారు. ఎవరికి వాళ్లే కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలు రచించారు. గుర్తింపు కోసం తాత్కాలిక ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వమంటూ వున్న విషయం వాళ్లకు తప్ప మరెవరికీ తెలియదు. వీళ్లంతా శరణార్థులకు సాయం చెయ్యాలనుకోవటంలో సేవాదృక్పథమెంతుందో, అధికారదాహం అంతకంటే ఎక్కువుంది.

మార్క్స్, తనను తాను ఈ ఫ్యాక్షన్ నాయకులలో ఒకడిగా ఎప్పుడూ భావించలేదు. "మద్యశాలలో కూర్చుని గ్లాసులు ఖాళీచేస్తూ తమ చుట్టూ ఉన్నవాళ్లే తమ మంత్రి వర్గమని కలలుకనే ప్రజాస్వామిక నియంతలు వీళ్లు" అన్నాడు వ్యంగ్యంగా. మార్క్స్‌ను ఎంతమంది ఎన్నిసార్లు 'నియంత' అని ఆరోపించినా, ఆయనకెప్పుడూ ఏ దేశానికీ అధినేత కావాలనే కోరిక లేదు. జనమంతా తనకు జేజేలు కొట్టాలనుకోలేదు. "బుర్రలేని మనుషులు. వీళ్లకున్నదంతా అధికార వర్గ భావజాలమే" అన్నది ఆయన అభిప్రాయం. కాని వాళ్లకు బోధించటానికి మాత్రం ప్రయత్నించాడు. చరిత్ర గతి గురించిన తన అవగాహన సరైనదైతే "వీళ్లు రాబోయే రోజులకు ప్రతినిధులు". జ్ఞానాన్ని పెంచుకుని, చైతన్యవంతలైన జనం, తమ సంఖ్యాబలంతో అధికార వర్గాలను చిత్తుగా ఓడించగలరు. వేలాదిగా తరలివచ్చిన ఈ శరణార్థుల వంటి కార్మికులే సమసమాజాన్ని, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించగలరు. ఈ క్షణాన వాళ్లక్కావలసింది సిద్ధాంతం కాదు. తిండి తినటానికి కొద్దో గొప్పో దొరికిన వాడికే కలలు కనే శక్తి వుంటుంది. ఇంగ్లండులో ఉన్న శరణార్థులకు తోచిన సాయం చెయ్యమని జర్మనీలో వున్న దాతలకోసం ఒక అప్పీలు తయారు చేసి పంచింది మార్క్స్ బృందం.

"ఎప్పుడేమవుతుందో, ఎటుపోవాలో తెలియని పరిస్థితిలో వున్నారు. రాజకీయంగా ఎవరు ఏదైనా లిబరల్, డెమోక్రాట్, రిపబ్లికన్ లేదా సోషలిస్టు అందరూ ఇక్కడ శరణార్థులే. అందరూ దినదిన గండంగా గడుపుతున్న వాళ్లే. చింకిపోతల్లో, దేశంలోని సగం జనాభా విదేశీ గడ్డ మీద ముష్టెత్తుకుంటున్నారు. ఈ దివ్య భవ్య నగరం లండన్ పేవ్‌మెంట్ల మీద చలికి గడ్డకట్టుకుపోతూ కనిపిస్తారు మన సోదరులు. ఈ నగరంలోని ప్రతి వీధి జర్మన్‌ల ఆర్తనాదాలతో మార్మోగుతున్నది".

కమిటీ సభ్యులెవరూ విరాళాల్ని సొంతానికి వాడుకోరనీ, ప్రతినెలా ఖర్చులలెక్కలు ప్రచురిస్తామనీ వాగ్దానం చేశారు. నవంబర్ రెండో వారానికల్లా 14 కుటుంబాలకు సహాయం చెయ్యగలగినంత డబ్బుపోగైంది. మరో అరవై కుటుంబాలు కమిటీ సహాయం మీదే ఆధారపడి వున్నాయి. త్వరలో ఆ సంఖ్య 500కు పెరుగుతుంది. కమిటీ వాళ్లు ఒక సమిష్టి లాడ్జింగ్, భోజన శాల కూడా సోహోలో ఏర్పాటు చేశారు. వృత్తి పనివాళ్ల కోసం ఒక వర్క్‌షాపు కూడా నిర్వహించారు.

శరణార్థులను ఆదుకోవటానికి త్వరలో మార్క్స్ చుట్టూ వీర్త్, రెడ్‌వూల్ఫ్, కార్లబ్లైండ్, కమ్యూనిస్ట్ లీగ్‌కు చెందిన హైన్రిష్ బార్, ఆగస్ట్‌విల్లిచ్‌లతో ఒక గ్రూపు ఏర్పడింది. ఎప్పటిలాగే జెన్నీ సెక్రటరీ బాధ్యతలు నిర్వర్తించాలి. త్వరలో ఎంగెల్స్ కూడా వచ్చి చేరతాడు.

మార్క్స్ దంపతులు కొలోన్ వదిలినప్పటి నుండీ, ఎంగెల్స్ ఉత్తరాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అతడు బేడెన్ యుద్ధంలో పాల్గొంటున్నాడు (విల్లిచ్ నాయకత్వంలో పనిచేస్తున్న సుమారు ఎనిమిది వందల మంది స్వచ్ఛంద సైనికులు మీద ఆజమాయిషీ చేస్తున్నాడు.

బేడెన్‌లోని తిరుగుబాటు దారుల సంఖ్య 6000-13000 మధ్య వుంటుంది. వాళ్లు 60,000 మంది ప్రష్యన్, బవేరియన్ సైనికులను ఎదిరించాలి. యుద్ధంలో కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు మాల్ హతుడైన తర్వాత, ఎంగెల్స్ స్విట్జర్లాండులోకి ప్రవేశించి. జెనీవాకు వెళ్లి ఇటలీ సరిహద్దులు దాటి సముద్ర మార్గంలో, జిబ్రాల్టర్ ద్వారా ఇంగ్లండులోకి ప్రవేశించాడు.

జెన్నీ ఆగమనం తర్వాత, కొద్ది కాలం పాటే లెస్టర్‌స్క్వేర్‌లో గడిపాడు మార్క్స్. ఇంగ్లీషు మాట్లాడే మిత్రుల సాయంతో చెల్సీలోని కింగ్స్‌రోడ్‌లో రెండుగదుల అపార్ట్‌మెంటొకటి దొరికింది. అక్కడున్న వాళ్లంతా మార్క్స్‌లాగే శరణార్థులు. అయినా సోహో కన్నా మెరుగైన చోటే. ఇక్కడికి రావటం వల్ల కనీసం జెన్నీకి మరో కొడుకును కనటానికి ప్రైవసీ దొరికింది.

1849, నవంబర్ 5నాడు జరిగింది జననం. ఆ రోజు గైఫాక్స్ డే. నగరమంతా టపాకాయల మోతలతో, వెలుగులతో పండగ చేసుకున్నది. (గైఫాక్స్ 1570-1606. గుయిడో ఫాక్స్ అని కూడా పిలుస్తారు. అతడు రాజుకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు విఫలమైంది). తమ నాల్గవ సంతానానికి హైన్రిష్ గుయిడో మార్క్స్ అని నామకరణం చేశారు మార్క్స్ దంపతులు. ఆ తిరుగుబాటుదారు గౌరవార్థం కొడుకును ఫాక్స్‌చెన్ అని పిలిచారు. ఇదంతా బాగానే వుంది కాని మొదటి నుండీ ఈ కుర్రాడు అనారోగ్య పీడితుడే. పాలదాయిని పెట్టుకోవటానికి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవటంతో జెన్నీ స్వయంగా పాలివ్వాల్సి వచ్చింది. రాత్రింబవళ్లు ఏదో బాధతో ఏడుస్తూనే వున్నాడు పిల్లాడు. "నా పాలతో పాటే నా బాధలూ, దు:ఖమూ వాడు పంచుకున్నాడు" అంది జెన్నీ. "మార్క్స్ ఇంట్లోకి ప్రవేశించిన ఈ బుల్లి కమ్యూనిస్టు తన ఏడుపుతో ఎవరికీ నిద్ర లేకుండా చేశాడు" అన్నాడొక సన్నిహితుడు. ఏమీ చెయ్యలేని నిస్సహాయంతో రోజురోజుకూ బలహీనపడుతున్న కొడుకును దిగులుగా చూసింది జెన్నీ.

గుయిడో పుట్టిన వారం రోజులకు నవంబర్ 12 నాడు లండన్ చేరుకున్నాడు ఎంగెల్స్. అతని రాకతో మార్క్స్‌కు ధైర్యమొచ్చింది. శరణార్థుల కమిటీ నుండి పెటీబూర్జువాలను తొలగించాడు. వాళ్లతో కలిసి పనిచెయ్యటం తనకేమాత్రం ఇష్టం లేదు. 1848 విప్లవానికి వాళ్లు చేసిన ద్రోహం ఎప్పుడూ మరిచిపోలేడు. శరణార్థుల ప్రయోజనం కోసం అందరి సహకారం అవసరమే అయినా ఆ ద్రోహుల పొడే తనకు గిట్టదు.

అయితే పత్రిక విషయంలో ఆయనకిలాంటి పట్టింపులేమీ లేవు. 500 పౌండ్లు పెట్టుబడి పెట్టగలిగిన సంపన్నుడి కోసం నిరీక్షించాడు. "చివరికి సైతానుతోనైనా, రాజకీయాల్లో ఎవరితోనైనా కలిసి పనిచేయవచ్చు. కాకపోతే మనం వాడి వలలో పడకుండా. వాడు మన వలలో పడేటట్టు జాగ్రత్తపడాలి" అంటాడొక చోట. ఎవరు పెట్టుబడి పెట్టినా, తను రాయదలచుకున్నదే రాస్తానని గట్టి నమ్మకం.

(సశేషం)



ఏకాంతంలో గడపడం విస్లావాకు ఎక్కువ ఇష్టం. ఆ ఏకాంతం తన కవిత్వానికి చాలా ముఖ్యమైనదని, అది ఒక విధంగా తనకు ప్రేరణ అని నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత విస్లావా సింబోర్స్కా అన్నారు. ఏకాంత సమయాల్లో ఆమె సృజించే కవిత్వం విలక్షణమైందిగా ప్రసిద్ధి చెందింది. ఈతరం కవిత్వ పాఠకుల్ని సైతం ఉద్దీపింపజేసే గుణం ఆమె కవిత్వంలో వుంది. కవిత్వరచనలో తనదైన పద్ధతిలో ప్రయాణించిన విస్లావా సింబోర్స్కా **1996**లో నోబెల్ బహుమతి పొందిన తొమ్మిదవ మహిళ. మొదటి పోలండ్ నోబెల్ కవయిత్రి. పశ్చిమ పోలండ్ లోని పోజ్నన్ దగ్గర బ్నిన్ (ఇప్పుడది కోర్నిక్) లో ఆమె జన్మించారు. పూర్తి పేరు: మరియ విస్లవ అన్న సింబర్స్క. తండ్రి - విన్సెంటి సింబర్స్కి, తల్లి - అన్నా మరియ నీ రోట్టెర్మండ్. వారి ఇద్దరు కూతుళ్ళలో విస్లావా రెండవది. జకోపేన్‌లోని వ్లాడిస్లవ్ జమొయిస్కి భూసంపత్తి కి తండ్రి పర్యవేక్షకుడుగా పనిచేసారు. జమొయిస్కి మరణించాక, **1926**లో కుటుంబమంతా తొరున్‌కి తరలిపోయారు. అక్కడే ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం మొదలయింది.

ఆమె కవిత్వం పాఠ్యాంశం

ఆమె తండ్రి విస్తృతంగా చదివేవారు. చదివిన పుస్తకాల మీద ఇంట్లో చర్చించుకునే వారు. అయిదేళ్ల ప్రాయంలోనే చిన్న చిన్న కవితలు రాసింది విస్లావా. దానికి ఎంతగానో పొంగిపోయిన తండ్రి జేబులో వున్న డబ్బులు ఉన్న నాణేలు వెదికి ఇచ్చి ఉత్సాహపర్చేవారు. అందుకనే అయిదేళ్ల ప్రాయం నుంచే తాను రాసినదానికి సంపాదించడం మొదలెట్టానని పెద్దయాక గర్వంగా చెప్పుకున్నారామె. ఎనిమిదేళ్ల ప్రాయంలో 1931లో, తొరున్ నుండి దక్షిణ పోలండ్ లోని క్రాకోవ్‌కి వెళ్లాల్సొచ్చింది. అక్కడే కాన్వెంట్ స్కూల్లో చదువు కొనసాగింది. 1936లో తండ్రి మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో 1940 నాటికి జర్మనీ సైన్యం క్రాకోవ్‌ని ఆక్రమించింది. తన తల్లి ఎట్టి పరిస్థితుల్లోనూ క్రాకోవ్ పట్టణాన్ని వదిలి వెళ్లనంది. పోలిష్ నాగరికుల్ని పౌర పాఠశాలల్లో చదవడం నిషేధించారు. ఫలితంగా అజ్ఞాతంగా నడపబడుతున్న పాఠశాలలో చదువుకున్నారు విస్లావా. తనని కార్మిక శిబిరానికి జర్మన్లు పంపకుండా తప్పించుకునేందుకు, 1943లో రైల్వేలో గుమాస్తాగా చేరి పని చేసారు. 1945లో యుద్ధం ముగిసాక, 1945 నుండి 1948 వరకూ జగియెలోనియన్ విశ్వవిద్యాలయంలో పోలిష్ ప్రాచీన భాషా శాస్త్రం, సామాజిక శాస్త్రం చదువుకున్నారు. అక్కడ చదువుతుండగానే క్రాకోవ్ సాహిత్యం తోను, చెస్లోవ్ మిలోజ్ తోను పరిచయాలు ఏర్పడ్డాయి. అదే సమయంలో 1948లో, కవి, సంపాదకుడు, అనువాదకుడు అయిన ఆదం వ్లొడెక్ (1922-1986) ని ఆమె పెళ్లి చేసుకున్నారు. ఆర్థిక ఒత్తిళ్ళ కారణంగా అదే ఏడాది పట్టభద్రురాలు కాకుండానే చదువు ఆపేయాల్సొచ్చింది. పెళ్ళయాక భర్తతో కాపురమున్న ఇల్లు రచయితలకు, కవులకు ఒక కేంద్రబిందువు అయింది. అయితే ఆ వివాహబంధం 1954 వరకే కొనసాగింది. వారికి పిల్లలు లేరు. విడాకులు తీసుకుని తల్లితో ఒంటరిగా ఉన్నారు.

మార్చి 1945లో క్రాకోవ్ స్థానిక వార్తాపత్రిక "పదంకోసం నేను ఎదురుచూస్తున్నాను" అనే విస్లావా మొదటి కవితను ప్రచురించింది. 1948 నాటికి ఆమె మొదటి కవితా సంపుటి తయారైంది. అయితే కమ్యూనిస్టు భావాల్ని ముందుకు తీసుకుపోయే లక్షణాలేవీ అందులో లేవని, దాని ప్రచురణకు అప్పటి పోలండ్ ప్రభుత్వం అంగీకరించలేదు. విస్లావా దానిలో అనేక మార్పులు చేసి 1952 నాటికి "అందుకనే మనం బతికున్నాం" శీర్షికన తీసుకువచ్చింది. అది పోలండ్ కమ్యూనిస్టు పాలకులు అధికారికంగా అంగీకరించిన సామ్యవాద వాస్తవికతకు దగ్గరలో సాహిత్య ప్రమాణాలకు లోబడి ఉంది. 1954లో అవే భావాలతో అదే కోవలో "తనను తాను అడిగిన ప్రశ్నలు" మరో కవితా సంపుటి వచ్చింది.

1953లోనే "సాహిత్య జీవితం" వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1960లో తల్లి మరణించాక, మరింత ఒంటరయింది. ఆ వారపత్రిక లోనే 1981 వరకూ దాదాపు 30 ఏళ్లు వివిధ హోదాలో పనిచేసారు. ఆ కాలంలో కవయిత్రిగానే కాకుండా, సమీక్షకురాలుగా, ఫ్రెంచ్ కవిత్వం అనువాదకురాలుగా కూడా గుర్తింపు పొందారు. 1980లో గుప్తంగా నడిచిన ఒక పత్రికకు స్టాన్సీకొవ్నా మారుపేరుతో రచనలు చేసారు. పారిస్ నుండి వచ్చే ఒక పత్రికకు కూడా అదే పేరుతో రాసారు. కవయిత్రే కాకుండా ఆమె అద్భుతమైన చిత్రకారిణి కూడా. "ఆంగ్లంలో మొదటి అడుగులు" అన్న పాఠ్య పుస్తకానికి అన్ని బొమ్మలూ ఆమే వేసింది.

స్టాలిన్ శకం ముగిసాక, 1956 తరువాత వచ్చిన కవిత్వంలో మార్పూ, వేగమూ స్పష్టంగా కనిపిస్తాయి. అప్పుడు వచ్చిన సంకలనాల్లో - "ప్రపంచం మీద నేను ధ్యానిస్తాను", "యతి ని పిలుస్తూ", "ఉప్పు" లాంటి సంపుటాలు వచ్చాయి. అందులో "యతి ని పిలుస్తూ" ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందింది. ఆ తరువాత మరో కవితా సంపుటి "పెద్ద సంఖ్య", "వంతెన మీద జనం" వచ్చాయి. ఆమె పోలండ్‌లో అందరినీ ఆకట్టుకున్న కవయిత్రి కావడం మొదలయింది. విద్యార్థులకు ఆమె కవిత్వం పాఠ్యాంశం అయింది. జాతీయ అంతర్జాతీయ బహుమతులు రావడం మొదలయాయి. తల్లి మరణంతో ఒంటరిదైన విస్లావా, 30కి పైగా గ్రంథాల రచయిత, కవి కోర్నెల్ ఫిలిపొవిస్జ్‌తో, 1969 నుండి 1990లో అతను మరణించేవరకూ చాలా చేరువయింది. అప్పటికే రెండు పెళ్లిళ్లతో ఇద్దరు కొడుకులున్న

అతనితో, కలిసి నివసించలేదు, వివాహమూ చేసుకోలేదు. అయితే అతని జ్ఞాపకాలతో అతనికోసమే రాసిన కవితల సంపుటి 1993లో వచ్చింది. తనకు రాసిన ప్రతీ పోస్టుకార్డు ఉత్తరాల్లో, తరువాత ఉత్తరంలో తాను రాసిన కవిత పంపిస్తానని ఊరించి ఊరించి, అద్భుతంగా చేసిన సూపులతో మాత్రం సంతృప్తి పర్చిన ఆమె ఒకే ఒక్క అక్క మరియ నవోజా 1997లో మరణించారు. దాంతో ఉన్న ఒక్క రక్త సంబంధం కోల్పోయింది. ఒక్కొక్కరు ఆమెని ఒంటరి చేస్తూ పోవడం, ఆమె కవితలమీద ప్రభావం చూపింది.

విస్లావా 1968-1976 మధ్య రాసిన సమీక్షలు "ఐచ్ఛిక పఠనాలు" పేరుమీద మూడు సంకలనాలుగా 2002లో వచ్చాయి. పేరుకు తగ్గట్టుగానే ఆ సమీక్షలు తనకు ఇష్టమైన, ప్రాచీన చరిత్ర, పక్షి శాస్త్రం, తోటపని, ఇంటి మరమ్మతులు, హఠయోగ మొదలైన ఎన్నో విషయాల మీద రాశారు. బల్గేరియా, స్లోవక్ యడ్డిష్, ఫ్రెంచ్ భాషలనుండి కవిత్వ అనువాదాలు చేసారు. 1980లో ఉధృతంగా పోలండ్‌లో జరిగిన ప్రజాస్వామ్య సంఘీభావ ఉద్యమంలో చేరారు. అలా చేరినందుకు అప్పటివరకూ చేస్తున్న సంపాదక వర్గ బాధ్యతలనుండి విరమించుకోవల్సి వచ్చింది. అయితే ఆ ఉద్యమం మూలంగా తనలో నాగరికురాలుగా మార్పున్నా, తన కవిత్వంలో మాత్రం మార్పు రాలేదని ఆమె చెప్పారు.

విస్లావా కవిత్వం అనేక భాషల్లోకి అనువాదమయింది. "శబ్దాలు, అనుభూతులు, ఆలోచనలు" 70 కవితల ఆమె ఆంగ్లానువాద సంపుటితో, 1981 నుండి ఆంగ్ల ప్రపంచం ఆమెను గుర్తించడం మొదలయింది. 1957 నుండి 1993 వరకూ రాసిన కవితలు కొన్నింటిని తీసుకుని రెండవ ఆంగ్లానువాద సంపుటి "ఇసుక రేణువుతో దర్శించు" 1995లో అచ్చయింది. 1996లో నోబెల్ బహుమతి ప్రకటించాక ఈ సంకలనం విశేషంగా అమ్ముడుపోయింది. ఈ పురస్కారం తర్వాత పాఠకుల్లో ఆమెకు లభిస్తున్న ఆదరణ మరింతగా ఇనుమడించింది. ఆమె కవితల ప్రేరణతో "ఎరుపు" అన్న చలన చిత్రం వచ్చింది. కొన్ని కవితలకు బాణీలు కట్టబడి ప్రజాదరణ పొందాయి. ఆమె కవితలకు పోలండ్ ప్రఖ్యాత సంగీతకారుడు బిగ్నెవ్ ప్రైస్నెర్ సంగీతాన్ని సమకూర్చారు. 1957-1997 మధ్య వచ్చిన కవితలతోనే "కొత్త కవితలు" సంపుటి 1998లో వచ్చింది. విస్లావా చదువుకున్న విశ్వవిద్యాలయంలో స్వీడిష్ శాఖలో పనిచేసిన ఆండెర్స్ బోడెగార్డ్ స్వీడిష్ భాషలో చేసిన ఈమె కవితల అనువాదం, నోబెల్ బహుమతి ప్రదాతలను బాగా ఆకట్టుకుంది. అదే ఆమెకు నోబెల్ బహుమతి పొందడానికి మార్గం సుగమం చేసింది.

ఆమె కవితా సంపుటాలన్నీ చాలా చిరుపుస్తకాలే. కనుక ఆమెకు నోబెల్ బహుమతి అప్పట్లో రావడాన్ని సాహిత్య ప్రపంచంలోని చాలామంది జీర్ణించుకోలేక పోయారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా కవిత్వం రాసినా, ప్రచురితమైన కవితలన్నీ 400 కూడా లేవు. ఈ కవితలన్నీ ఒకే సంపుటిగా ఆమె మరణానంతరం అచ్చయింది.

కవిత్వ పఠనం గురించి తన అభిప్రాయాల్ని విస్లావా ఒక చోట ఇలా చెప్పారు: "ఒక కవిత నేనొక చోట చదివినపుడు, మీ కవితల్లో ఇంత విషాదం ఏమిటి? జీవితంలో మాకు కొంత ఓదార్పు, కొంత వినోదం కూడా కావాలి కదా అన్నారు కొందరు. అదే కవిత మరో చోట చదివినపుడు - మీ కవితలు ఎందుకంత ఆనందభరితంగా హాస్యాస్పదంగా ఉంటాయి, జీవితం అంత విషాదభరితంగా ఉన్నపుడు? అని కొందరు అడిగారు. నిజానికి నా కవితల్లో నేను ఆశించేది కూడా ఆ అస్పష్టతే, నాణేనికి రెండువైపులున్నట్టు ఆనందం, విషాదాల సమ్మిశ్రం". ఇలా మాట్లాడిన విస్లావాకు కవిత్వానికి ఎంత ఆదరణ ఉంటుందో బాగా తెలుసు. వేయిమందిలో ఏ ఇద్దరో కవిత్వాన్ని ఆస్వాదిస్తారని భావించే వారు. అయినప్పటికీ పోలండ్ లో ఆమె కవితా సంపుటాలు ఏ వచన రచయిత పుస్తకాలకు తీసిపోనిరీతిలో అమ్ముడుపోతాయి. ఆమె లఘు కవితలు అస్తిత్వవాద ప్రహేళికలా పనిచేస్తాయి. ఆమె శైలి - సంగ్రహం, ఆంతర్ముఖత్వం, చమత్కార మిళితం. కవుల్ని ఇష్టపడే పోలండ్ లో, ఆమె కవిత్వం చాలామందికి కంఠతా వచ్చు. చనిపోయిన యజమానికోసం ఒక పిల్లి దృష్టికోణంతో రాసిన "ఖాళీ ఇంటిలో పిల్లి" కవిత చిన్నా పెద్దా అందరి ప్రజాదరణ పొందిన ఒక గొప్ప కవిత.

ఏకాంతంలో గడపడం తనకు ఎక్కువగా ఇష్టమని ఆమె చెప్పేవారు. ఆ ఏకాంతం తన కవిత్వానికి చాలా ముఖ్యమైనదని, అది ఒక విధంగా తనకు ప్రేరణ అనేవారు. అయినా ఆమె ఏకాంతవాసం మీద మాత్రం కవిత్వం సృజించలేదు. మరీ బహిరంగ రాజకీయం కాకుండా ఆమె కళా సౌందర్యాత్మకమైన కవిత్వం ఎక్కువగా ప్రజాస్వామికం. అనేక స్వరాలలో ఆమె గొంతు ఎప్పుడూ ఉద్విగ్నతకు లోను చేసేలా సజీవంగా ప్రశ్నిస్తుంది. ఒక్కోమారు ఆమె కవిత్వం తక్షణం చెప్పే రహస్య సలహాలా కూడా ఉంటుంది. తాత్విక, నైతిక సంబంధమైన విషయాల్ని సహానుభూతితో పరిశోధించడం ఆమె రచనలన్నింటిలో కనిపిస్తుంది. ఆమె వాడే పదాల్లో లోనా బయటా ప్రేమ, నష్టం, వలసలు, చమత్కారం, అంతర్దృష్టితో పాఠకుడు జవాబులకోసం వెతుకుతాడు. సంకోచం నమ్రత విస్లావా గుణాలుగా అందరూ చెబుతారు. ఆమె సమకాలీన కవి చెస్లోవ్ మిలోజ్ కి ఆమె, ఆమె కవిత్వం ఇష్టం. విస్లావా కవిత్వ ప్రపంచంలో ఎవరైనా హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చున్నారు. చమత్కారం, వివేకం, ఉత్సాహం, అన్నీ రంగరించి ఆమె ప్రతి కవిత అసాధారణంగానూ, మరచిపోలేనివిగానూ ఉంటాయని ప్రశిద్ధ విమర్శకుడు స్టానిస్లా బరంక్ అభిప్రాయపడ్డారు. రోజువారీ జీవితపు సాధారణ విషయాల్లోని అసాధారణ నిజాల్ని వెలికితీసే ప్రయత్నం ఆమె కవిత్వం.

కవులు ఒక విధమైన స్వీయ స్వాతిశయంతో ఉంటారని ఆమె అభిప్రాయం. ప్రజల దృష్టిలో పడడానికి ఇష్టపడే వారు కాదు. సభల్లో పది పదిహేను మంది కంటే ఎక్కువగా ఉంటే ప్రసంగించడానికి కూడా ఇబ్బంది పడేవారు. తన గదిలో తాను చదువుకుంటూ రాసుకుందుకే ఎక్కువ సమయం కేటాయించుకునే వారు. నోబెల్ బహుమతితో బాటు, పోలిష్ క్లబ్, హెర్డెర్, గోథే బహుమతులు పొందారు. విస్లావా విశ్రాంత జీవనాన్ని ఎక్కువగా ఇష్టపడేవారు. విపరీతంగా సిగరెట్లు కాల్చే అలవాటున్న, విస్లావా సింబోర్స్కా, 1 ఫిబ్రవరి 2012 న వారి స్వగృహంలో ఊపిరితిత్తుల కేన్సరుతో 88 ఏళ్ల వయసులో మరణించారు. అయిదేళ్ళ ప్రాయంలో కవిత్వం రాయడం మొదలెట్టిన ఆమె మృత్యువు తనతో గుసగుసలాడే వరకు కూడా కవిత్వాన్ని సృజిస్తూనే వున్నారు. అంతగా కవిత్వంతో జీవితాన్ని సమ్మిళితం చేసుకున్నందునే ఆమె కవిత్వం ప్రతి తరానికి ఒక పాఠ్యాంశంగా నిలిచింది.

- ముకుంద రామారావు, 99083 47273

■ యాత్రా కథనం

ఎదనిండా... పాపికొండల నీరెండ



చాలా చిన్న ఊరు అది. మూడు వైపులా మేఘాలను ముద్దాడే ఎత్తయిన పర్వత శిఖరాగ్రాలు. మరో వైపు పల్లె పాదాలను ప్రక్షాళించే గలగలా గోదావరీ తరంగాలు. ప్రియురాలి నీలి నీలి శిరోజాలను నుండి జారిపడిన మల్లెమొగ్గలాగా ఉంది ఆ ఊరు. ఆకాశంలో విహరిస్తున్న ఏ దేవకన్యల సమూహమో, అలవోకగా అవనీతలంపైకి విసరివేసిన హరిత వర్ణపు సౌందర్య శకలంలాగా వుంది ఆ ఊరు.

పట్టుమని వంద ఇళ్ళైనా ఉంటాయో వుండవో! కానీ ఇప్పుడా వూరు ఉనికికే ప్రమాదం ముంచుకొచ్చింది.

"మేం మనుషులుగా ఖమ్మం జిల్లాలో వుంటామా? తూర్పుగోదావరి జిల్లాలో వుంటామా? తెలంగాణ వాసులుగా వుంటామా? ఆంధ్రా పౌరులుగా వుంటామా? అనేది సమస్య కానేకాదు అసలు! మమ్మల్ని మనుషులుగానే గుర్తించటం లేదు. అదీ అసలు సమస్య. కనీసం ఐదేళ్ళకు ఒకసారి 'ఓటు' వేసే ఓటర్లుగా కూడా గుర్తించటం లేదు. అదీ విషాదం" అతడీ భాషలో చెప్పలేదు కానీ అతడి భావం మాత్రం కచ్చితంగా యిదే! అతడి గొంతులోని జీర, వణుకు ఒక్కసారిగా నన్ను కదిలించాయి. ఒక దిగులు మేఘం ఏదో హఠాత్తుగా నన్ను కమ్ముకుంది.

ఖమ్మం జిల్లాలోని.. ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయిన కూనవరం సబ్ డివిజన్‌లోని 'పోచారం' గ్రామం అది. పోలవరం కల సాకారమయితే గోదావరిలో శాశ్వతంగా కలిసిపోయే 270 గ్రామాలలో అది కూడా ఒకటి. కనీసం నాలుగు లక్షలమంది ప్రజలు, గిరిజనులు నిరాశ్రయులవుతారని అంచనా. కేవలం పోలవరం నిర్మాణంలో వున్న ముంపు గ్రామాల సమస్యను ఎదుర్కోవటం కోసమే భద్రాచలం, కూనవరం, పాల్వంచ, బూర్గుంపహాడ్ లాంటి ఏడు మండలాలని ఆంధ్రాకి పునర్విభజన సందర్భంగా బదలాయించారనేది కరకు వాస్తవం.

పాపి కొండల గురించి గత రెండు దశాబ్దాలుగా వింటూ చదువుతూ వస్తున్నా... వాటిని సందర్శించే అవకాశం మాత్రం ఇంత వరకూ కలగలేదు.ఇప్పుడు కూడా అనుకోకుండా, అప్రయత్నంగా కలిగిందీ అవకాశం.

గోదావరిలో ఎక్కువగా నీళ్ళు లేకపోవడంతో కూనవరం నుండి మొదలు కావలసిన మా ప్రయాణం అక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలోని 'పోచారం' రేవు నుండి మొదలయింది. భద్రాచలం నుండి పోచారం గంటన్నర ప్రయాణం. కూనవరం దాటిన తరువాత దట్టమయిన అరణ్యంలో నుండి సాగే ప్రయాణం ఒక అద్భుతం. రహదారికి ఇరువైపులా ఎత్తుగా పెరిగి, పందిరి వేసినట్లుగా కలగలిసిపోయిన చెట్ల ఆకుల సందులలో నుండి నేలకు జాలువారుతున్న సూర్యకిరణ సందోహం, భూదేవి ముంగిట ఆకాశం వేసిన అతి పెద్ద రంగవల్లికలాగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో షికార్లు పోతున్న పికిలి పిట్టల గుంపులు, అక్కడక్కడా పొలాలలో ఆరబోసిన ఎర్రటి మిరపకాయల కళ్ళాలు, కేరేజీలు చేత పట్టుకని ఆటోల నిండుగా పరుగెడుతున్న జన సమూహాలు, మాఘమాసపు బహుళ త్రయోదశి ఉదయపు సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

పోచారం చేరుకునే సరికి ఉదయం పది గంటల ముప్పై నిముషాలు అయింది. రేవులో వరుసగా మూడు పడవలు నిలిచి ఉన్నాయి. మా పడవ పేరు సాయి విహార్. ప్రయాణానికి ఇంకా కాస్త సమయం వుండటంతో నాకెదురయిన ఒక యువకుడిని మాటల్లోకి దించాను. అతడు మాతో పాటు సాయి విహార్‌లోనే పేరంటాలపల్లి దాకా ప్రయాణించబోతున్నాడు. పేరు బాలు.

'మమ్మల్ని మనుషులుగా కూడా గుర్తించటం లేదు' అన్నది బాలు అవేదనే! పడవ బయల్దేరినా అతడి ఆవేదనలోని చురుకుదనం నన్ను వీడలేదు.

ఆ తర్వాత బాలు నాతో ఏమేమి మాట్లాడాడో నాకు గుర్తులేదు. కానీ ఆ ప్రశ్న మాత్రం... ఎప్పటికీ గుర్తుండి పోతుందేమో!

పోచారం నుండి పేరంటాల పల్లి దాకా గంటన్నర ప్రయాణం. ఈ ప్రయాణం విసుగు తెప్పించకుండా వుండటం కోసం బాలు తన బృందంతో కలిసి పిల్లలతోనూ, పెద్దలతోనూ, భార్య భర్తలతోనూ డాన్సులు చేయించాడు. రకరకాల స్కిట్స్ ప్రదర్శించాడు.

నది మీద పడవ మెల్లమెల్లగా కదులుతూ వుంటే గోదావరి మెల్లమెల్లగా నన్ను తనలోకి లాగేసుకుంది. ఈ గోదావరిలో గొప్ప ఆకర్షణ వుంది. అది ఎవరినైనా తనలోకి లాగేసుకుంటుంది. ఆ ఆకర్షణని వర్ణించటానికి భాష లేదేమో. ఎన్ని వేల సంవత్సరాలుగా ఈ గోదావరి ఇలా ప్రవహిస్తూ వస్తుందో... ఎప్పటికప్పుడు తన కోసమే ఈ గోదావరి ప్రవహిస్తోంది అని ఎవరికి వారు అనుకునేలా చేయగలిగిన మార్మిక శక్తి ఏదో ఈ గోదావరిలో వుంది.

పేరంటాలపల్లి చేరుకునే సరికి సరిగ్గా పన్నెండు గంటలు. 'శ్రీరామ కృష్ణ మునివాటము' అనే పేరున్న ఒక ఆశ్రమం విశ్వేశ్వరుడి ఆలయం పేరంటాలపల్లిని సందర్శించే యాత్రికులకు ముందుగా ఎదురయ్యే

స్థలాలు. గుడి చుట్టూ ఉన్న వెదురు పొదల నుండి గాలి సృష్టించే వంశీరవం మంద్రంగా వినిపిస్తూనే వుంటుంది. సర్వమత చిహ్నాలయిన ఓంకారం, శిలువ, స్వస్తిక్, నెలవంక గోపుర కలశంలో కొలువుదీరి కనువిందు చేస్తాయి. మేం పడవ దిగుతుండగా బాలు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.

"మనం దేవాలయంలో గంటను మూడుసార్లు మోగిస్తాం కదా! యిక్కడ అలా కొట్టకూడదు. ఒక్కసారి మాత్రమే కొట్టాలి. మతం ఏదయినా మనిషి ఒక్కడే అనే భావనకు అర్థం చెప్పటం కోసం మనం గంటను ఒక్కసారి మాత్రమే కొట్టాలి".

సర్వమత సమాహారంగా ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఆలయం ముందు కొండలలో నుండి సన్నగా ధారలాగా ప్రవహిస్తున్న నీటిలో కాళ్ళూ, చేతులూ కడుక్కున్నాము. చల్లటి నీళ్ళు శరీరాన్ని తాకగానే ఒక నూతన ఉత్తేజం ఏదో నాలో కలిగింది.

విశ్వేశ్వర స్వామి ఆలయంలో సాంప్రదాయ పూజారి లాంటి వారు ఎవరూ మాకు కనిపించలేదు. కేవలం పానవట్టం మీద కొలువైన విశ్వేశ్వరుడు, అతడి చుట్టూ వెలిగించిన దీపాలు. విశాలమైన ఆలయంలో శివుడి ఎదురుగా కూర్చుని భజన చేస్తున్న భక్తుల సమూహం.

ఆలయం నుండి బయటకు వచ్చిన తరువాత అక్కడి గిరిజనులు తయారు చేసిన వెదురు పుష్ప గుచ్చాలు రెండు కొనుక్కున్నాము. ఒకానొకప్పుడు ఈ పేరంటాల పల్లిలో కొలువైన స్వామి బాలానంద ఇక్కడి గిరిజనుల జీవితాలలో గొప్ప మార్పును తీసుకు వచ్చాడు అని చెప్పారు. మద్రాస్ ప్రెసిడెన్సీతోనూ, నిజాం ప్రభుత్వంతోనూ ఎడతెగని సంప్రదింపులు జరిపి ఒక సహకార ఉద్యమాన్ని ఈ పేరంటాలపల్లిలో నిర్మించాడని, అది మిగతా గిరిజన గ్రామాలకి కూడా విస్తరించి వాళ్ళ జీవితాల్లో అనూహ్య మార్పు తీసుకుని వచ్చిందని చెప్పారు.

పోచారం నుండి మాతో వచ్చిన బాలు పేరంటాలపల్లిలో సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. గంటన్నర సేపు పడవ ప్రయాణికులని ఎంటర్‌టైన్ చేసినందుకు, ప్రయాణీకులు డబ్బు రూపేణా ఇచ్చిన కానుకలని తీసుకుని అతడు, అతడి బృందం వెళ్ళిపోయారు.

పేరంటాలపల్లి నుండి మరొక అర్థగంట గోదావరిలో ప్రయాణించాక ఇసుకతిన్నెలలో అక్కడక్కడ వేసిన తాటాకు పందిళ్ళ కింద లంచ్ ఏర్పాటు చేశారు.

"నిద్ర సుఖమెరుగదు. ఆకలి రుచి ఎరుగదు" అన్నట్లు ఆకలితో ఆవురావురుమంటున్న ప్రయాణీకులు అందరూ పడవ వాళ్ళు ఏర్పాటు చేసిన భోజనాన్ని ఆవురావురు మంటూ తిన్నారు. రాజమండ్రి వెళ్ళే ప్రయాణీకులను మరో పడవలోకి ఎక్కించాక మా పడవ మళ్ళీ బయల్దేరింది.

'పేరంటాల పల్లి' నుండి 'కొండ మొదలు' అనే గ్రామం దాకా విశాలంగా ఆవరించుకున్న పాపికొండల సముదాయము, వాటి మధ్యగా సన్నగా, ఉధృతంగా ప్రవేశించే గోదావరి. ఊహ వాస్తవం ఏకమయ్యే చోటు అది. అనుభూతి అనుభవం సంగమించే స్థలం అది.

రాజమండ్రి దగ్గర ఆరు కిలోమీటర్ల వెడల్పులో వుండే గోదావరి పాపి కొండల నడుమ కేవలం అరకిలోమీటరు విస్తీర్ణానికి కుంచించుకుపోతుంది. పడవ మెల్లగా, మెల్లమెల్లగా నడుస్తుంటే పడవవాడు ఏం చెప్తున్నాడో ఎవరూ వినిపించుకోరు. ఎవరికి వారు వాళ్ళ అనుభవిక ప్రపంచంలోకి వెళ్ళిపోయి... నదితోనూ, కొండలతోనూ ఒక ఆత్మిక సంభాషణ ఏదో చేస్తారు. నదికి రెండు వైపులా నిల్చున్న కొండలు, నదిలో నీళ్ళు తాగటానికి వచ్చి వరుసగా నిల్చున్న ఏనుగుల సమూహంలాగా వుంది అని కవి, మిత్రుడు చినవీరభద్రుడు చమత్కరించిన తీరు గుర్తుకొచ్చింది.

మనిషికీ, ప్రకృతికీ మధ్య వున్న అంతరం ఏదో తొలగిపోయి, సమస్త ప్రకృతిలో తాను కూడా కేవలం ఒక చిన్న భాగం అని అర్థం అయ్యే అపురూప క్షణం అది.

'కొండ మొదలు' నుండి తిరుగు ప్రయాణం ఆరంభమయింది. అప్పటికే భానుడి తీవ్రత తగ్గి సాయంకాలం కాబోతూవుంది.

గోదావరి మీద సూర్యకిరణాలు పడి బంగారు రంగులో తరళాంబతమవుతున్నాయి. ఒక చోట సువర్ణకాంతిలో, మరొక చోట నారింజరంగులో, వేరొక చోట కనకాంబరాలు పూచినట్లు, ఇంకొక చోట పసుపు పచ్చ గౌరీ మనోహరాల రంగు నదికి పులిమినట్లుగా సూర్యకిరణాలు నదిమీద ఎన్ని సోయగాలు పోవాలో అన్ని సొబగులు పోతూ కనువిందు చేస్తున్నాయి.

'తెల్లరుబ్బల' గ్రామానికి వీడ్కోలు పలుకుతున్నట్లుగా మా పడవ మలుపు తిరిగింది. ఈ తెల్లరుబ్బల గ్రామంలో కేవలం ఏడు కుటుంబాలు మాత్రమే నివశిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

ఆదిమ, ఆధునిక సమాజాల సంగమ స్థలం పాపికొండలు. ఆధునికుడు అనుకుంటున్న మనిషిలోని ఆదిమత్వాన్ని, అనాది అనుకుంటున్న ప్రకృతిలోని ఆధునికత్వాన్ని అవి పట్టి చూపిస్తాయి. చింతనాశీలి అయిన మనిషి లోలోపల ఒక అంతర్నేత్రం తెరుచుకుని ఆత్మ సంభాషణ చేయడానికి అవకాశం కల్పిస్తాయి.



పేరంటాల పల్లి దాటాక, దూరంగా 'తుమ్మలూరు' అనే గ్రామం సాయంకాలపు లేలేత నీరెండలో సూర్య భగవానుడు మారుతికి నారింజబంతి రంగులో కనిపించినట్లుగా కనిపిస్తోంది. వెదురుతో అల్లిన గుడిసెల పైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్, శతసహస్ర దళ వికసిత పద్మాల లాగా కనిపిస్తున్నాయి.

పోచారంలో మళ్ళీ పడవ దిగిన తరువాత గోదావరి వంక చూస్తే.. అమాయకత్వం మూర్తీభవించిన గిరిజన బాలికలాగా కనిపించింది. సాగర సంగమానికి పరుగులు తీస్తూ ప్రయాస పడుతున్న పోషిత భర్తృక లాగా కనిపించింది. అన్నం తిననని అలిగి కూర్చున్న ముసలి అమ్మలాగా కనిపించింది.

తొలి ప్రేయసి లేలేత దరహాసంలాగా కనిపించింది. జీవితాన్ని వెలిగించే సహచరి గాఢ పరిష్వంగంలాగా కనిపించింది.

పోచారం నుండి భద్రాచలం చేరేసరికి సాయంత్రం ఆరున్నర. రెండు దశాబ్దాల కల నెరవేరిన సమయం అది. ఈ కల మరొకసారి సాకార మవుతుందా? బాలు ప్రశ్నలకి సమాధానాలు లభిస్తాయా...?

కాలమే జవాబు చెప్పాలి!

- వంశీకృష్ణ, 9573427422

మనసున మల్లెల మాలలూగించే సాహిత్యం

'ఆంధ్రా షెల్లీ'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి సాహిత్యం అందరికీ తెలియకపోవచ్చేమో కానీ ఆయన పాటలు విననివారు, తెలియనివారుండరు. భావ కవిగా పేరుపొందిన ఈయన పాటల్లో లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం కనిపిస్తుంది. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిస్తే ఈయన రాసిన పాటల్లాగే ఉంటాయి. ప్రణయ, విరహ, భక్తిగీతాలు అన్నీ ఈయనకు కొట్టిన పిండే. 'రాజమకుటం, సుఖదు:ఖాలు, అమెరికా అమ్మాయి, గోరింటాకు వంటి చిత్రాల్లో మొత్తం కలిపి 170 పాటలు మాత్రమే రాసినా.. అన్నీ మర్చిపోలేని గీతాలే... ఆయనకు సాహిత్యంలోనే కాదు సంఘసేవలోనూ ప్రవేశం ఉంది. వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహం జరిపించారు.

'మల్లీశ్వరి' చిత్రంలోని "పిలచిన బిగువటరా, మనసున మల్లెల మాలలూగెనే, నోమి నోమ్మల్లాలా, ఆకాశ వీధిలో హాయిగా, పరుగులు తీయాలి..." అన్ని పాటలూ కృష్ణశాస్త్రి కలం నుండి జాలువారినవే.

అలసిపోయిన మనశ్శరీరాలకు విశ్రాంతి అవసరం. నిద్రతో శరీరమే కాదు, మనసూ సేద తీరుతుంది. మంచి నిద్రలో ఉన్నప్పుడు ఏ చిన్న శబ్దమైనా నిద్ర దూరమవుతుంది. అలసిన భర్తకు గాలి వీచిన శబ్దం, ఆకు రాలిన సడికి కూడా నిద్రాభంగమవుతుందేమోనని, వాటినే కట్టడి చేయాలనుకుంటే... ఆ పాట ఎన్టీఆర్, రాజసులోచన నటించిన 'రాజమకుటం' చిత్రంలో లీల పాడిన "సడిసేయకోగాలి సడిసేయబోకే బడలి ఒడిలో రాజు పవళించేనే" అంత మధురంగా ఉంటుంది. ఈ చిత్రానికి మాస్టర్ వేణు సంగీతం అందించారు.

ఒక్కోసారి సినిమాలో ఒక్క పాటలోనే సినిమా కథ మొత్తం ఇమిడి ఉందా అనిపిస్తుంది. అటువంటి పాటే చంద్రమోహన్, వాణిశ్రీ అన్నాచెల్లెళ్ళుగా నటించిన 'సుఖదు:ఖాలు' చిత్రంలో పి.సుశీల పాడిన "ఇది మల్లెల వేళయనీ... ఇది వెన్నెల మాసమనీ... తొందరపడి ఒక కోయిల ముందే కూసిందీ... విందులు చేసింది... కసిరే ఎండలు కాల్చునని ముసిరే వానలు ముంచునని". ఒక పక్షి జీవితంతో అమ్మాయి జీవితం పోల్చి చెప్పడం హృద్యంగా వుంది. దీనికి సంగీతం ఎస్.పి.కోదండపాణి.

చేతులను ఎర్రగా పండించే గోరింటాకును ఇష్టపడని పడతులుండరు. చేతులకు అందాన్నివ్వడమే కాదు, ఆరోగ్యానికీ మంచిదంటారు. అలాంటి గోరింటాకు మగువల చేతులను పండించే ఎరుపు రంగు ప్రకృతిలో ఇన్ని రకాలుగా వుంటుందా అనిపిస్తుంది. గోరింటాకు పండే రంగును బట్టి వారికి జీవిత భాగస్వామి ఎలాంటి వారొస్తారో చెప్పడం ఆసక్తికరం. శోభన్‌బాబు, సుజాత నటించిన 'గోరింటాకు' చిత్రంలో కృష్ణశాస్త్రి రాసిన పాటను ఇష్టపడనివారు వుండరు. "గోరింట పూసింది కొమ్మా లేకుండా...మురిపాల అరచేతా మొగ్గా తొడిగింది... ఎంచక్కా పండిన ఎర్రాని చుక్కా, చిట్టీ పేరంటానికి శ్రీరామ రక్ష". కె.వి.మహదేవన్ సంగీత సారథ్యంలో పి.సుశీల పాడారు. మరల మరల వినాలనిపించే పాట ఇది.

తెలుగు పాటంటే ఇలాగే ఉంటుందా అన్నట్టు ఉండే పాట 'అమెరికా అమ్మాయి' చిత్రంలో సుశీల పాడిన "పాడనా తెలుగు పాట పరవశమై మీ ఎదుట మీ పాట, పాడనా తెలుగు పాట...". తెలుగింటి ఆడపడుచు ఎలా వుంటుందో, తెలుగు నేలపై పారే గోదావరి గలగలలు, కోవెల గంటల మధురిమలు, తెలుగు కవులు రాసిన తేనెలూరే సాహిత్యం... ఇలా తెలుగు దనానికే వన్నె తెచ్చిన పాటంటే ఇదే అనిపించేలా రాశారు కృష్ణశాస్త్రిగారు. దీనికి జి.కె.వెంకటేష్ సంగీతం అందించారు.

గుడ్డు ముందా కోడి ముందా, చెట్టు ముందా విత్తు ముందా అంటే సమాధానం చెప్పలేం. అలాగే కోయిల గొంతు విన్న తర్వాత మామిడి చెట్టు చిగుర్లు తొడిగిందా, లేకపోతే మావి చిగురు తింటేనే కోయిల అంత కమ్మగా పాడగలుగుతుందా? ఏమో... అది చెప్పలేం కానీ చంద్రమోహన్, తాళ్ళూరి

రాజేశ్వరి నటించిన 'సీతామాలక్ష్మి' చిత్రంలోని మావి చిగురు తినగానే కోవిల పలికేనా... కోవిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా... ఏమో.. ఏమనునో గాని ఆమని.. ఈవని!!" అనే పాట గాన కోకిల సుశీల, ఎస్.పి.బాలు గాత్రంలో వింటే మాత్రం వసంత కాలంలో వేకువ జామున కోయిల గొంతు విన్నంత హాయిగా వుంటుంది.

మనిషి ఆశా జీవి. ఎప్పటికైనా, ఎలాగైనా ఉన్నత స్థితిలోకి రాకపోతానా అనే ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. తనపై తనకు నమ్మకముండి, ధైర్య సాహసాలు ఉన్న మనిషికి స్వీయాభిమానం ఎక్కువ. అలాంటి మనిషి తనను తానే వర్ణించుకుంటే ఆ పాట కృష్ణ, జయప్రద నటించిన 'శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ చిత్రంలో బాలసుబ్రహ్మణ్యం పాడిన "నా పేరు బికారి.. నా దారి ఎడారి....మనసైన చోట మజిలీ, కాదన్న చాలు బదిలీ" పాటలా వుంటుంది. ఇదే చిత్రంలో మరో పాట "ఆకాశ పందిరిలో నీకు నాకు పెళ్ళంట... అప్సరసలే పేరంటాళ్ళు... దేవతలే పురోహితులంట" పాట ఇప్పటికీ పెళ్ళిళ్ళలో వినిపిస్తూనే ఉంటుంది.

'కార్తీక దీపం' చిత్రంలో ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం....", 'బంగారు పంజరం' చిత్రంలో "పగలైతే దొరవేరా...", "ఏటి గట్టుకాడ ఎవరో...", శోభన్‌బాబు, శారద నటించిన 'బలిపీఠం' చిత్రంలో "కుశలమా... నీకు కుశలమేనా? మనసు నిలుపుకోలేక మరీ మరీ అడిగాను అంతే.. అంతే... అంతే...", 'ఉండమ్మా బొట్టు పెడతా' చిత్రంలో అడుగడుగున గుడి వుంది, అందరిలో గుడి వుంది..., చాలులే నిదురపో......, చుక్కలతో చెప్పాలని...., రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా....", 'ఈ నాటి బంధం ఏనాటిదో' చిత్రంలో "ఎవరు నేర్పారమ్మ ఈ కొమ్మకు పూలిమ్మని రెమ్మ రెమ్మకు..."... లాంటి ఎన్నో మరపురాని, మధురమైన సాహిత్యంతో కృష్ణశాస్త్రి పాటలు అలరిస్తున్నాయి. ఈ పాటలు చాలా సందర్భాల్లో వినే ఉంటారు. కానీ ఈ రసరమ్య గీతాల సృజనశీలి మన కృష్ణశాస్త్రి అని తెలిసిన వారు అరుదు. ఆ మహా మనీషిని స్మరించుకుంటూ మరోసారి వినండి.

– బి. మల్లేశ్వరి

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

నయా 'టెలిగ్రామ్'... ఇదో యాప్

ఒకప్పుడు అత్యవసర సమాచారాన్ని చేరవేసేందుకు వున్న ఏకైక సాధనం టెలిగ్రామ్. ప్రపంచవ్యాప్తంగా టెలిగ్రామ్ సేవలను ఇంకా గుర్తు చేసుకుంటూనే వుంటాం. తక్షణ సమాచారం కోసం టెలిగ్రామ్‌ను ఆశ్రయించక తప్పేది కాదు. అయితే... రోజులు మారాయి. సాంకేతిక విజ్ఞానం ఊహించని మలుపులు తిరిగింది. ఎన్నో సౌకర్యాలను మన ముంగిట్లోకి తెచ్చింది. అందులో భాగంగానే అలనాటి టెలిగ్రామ్ పేరుతో అధునాతన టెలిగ్రామ్ ఆవిష్కృతమైంది. ఇప్పటి సాంకేతికతకు తగినట్లుగా యాప్ రూపంలో మనముందుకొచ్చిన టెలిగ్రామ్... ఇంటర్నెట్‌లో అందుబాటులోకి రావడంతోపాటు, దేశీయ, విదేశీ ఫోన్లలో హల్‌చల్ చేస్తోంది.

సాధారణంగా స్మార్ట్‌ఫోన్ ఉందంటే... వాట్స్‌యాప్ అప్లికేషన్ తప్పనిసరిగా ఉంటుంది. మెసేజ్‌లను పంపడానికి ఉపయోగించే అప్లికేషన్లలో వాట్స్‌యాప్‌దే ప్రథమస్థానం. ఈ వాట్స్‌యాప్‌కి దీటయిన ప్రత్యామ్నాయంగా ఇప్పుడు టెలిగ్రామ్ యాప్ వేగంగా విస్తరిస్తున్నది. ఈ టెలిగ్రామ్ మెసెంజర్ యాప్ ఒపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్ కావడం మరో విశేషం. వాట్స్‌యాప్‌ని ఫేస్‌బుక్ కొనుగోలు చేసినప్పటికీ టెలిగ్రామ్ ఇంత పోటీ ఇవ్వడానికి కారణం వాట్స్‌యాప్‌ని మించిన ఫీచర్లు టెలిగ్రామ్‌లో వుండడమే.

రష్యాకు చెందిన నికోలయ్, పావెల్ డురోవ్ 2013లో ఈ యాప్‌కు ప్రాణం పోశారు. మొదట ఇంటర్నెట్ సేవల్లో అడుగుపెట్టిన ఈ యాప్ అనతికాలంలోనే మొబైల్‌రంగంలోకి ప్రవేశించింది. 2013 ఆగస్టు 14న టెలిగ్రామ్ యాప్ ఐఫోన్ వెర్షన్‌కు అనుగుణంగా మొట్టమొదటిసారి సెల్‌ఫోన్ వినియోగదారులకు పరిచయం అయ్యింది. 2013 అక్టోబర్ 20న అన్నిరకాల ఆండ్రాయిడ్ ఫోన్స్‌కు ఆల్ఫా వెర్షన్‌ను క్రియేట్ చేసిన టెలిగ్రామ్ యాప్ ఫౌండర్స్ విశేష ప్రయోజనాలతో యాప్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు.

ప్రస్తుతం ఈ యాప్ ఓ క్రేజ్‌గా మారింది. ఈ యాప్‌లో బ్రాడ్‌కాస్ట్, గ్రీన్‌చాట్స్, సీక్రెట్ చాట్స్, చాట్స్ అనే ఆప్షన్స్ వినియోగదార్లను అమితంగా ఆకర్షిస్తున్నాయి. ఉచితంగా లభించే ఈ యాప్ ద్వారా 50 ఎంబీ ఫైళ్లను మొబైల్స్‌కు గాని పీసీలకు గాని చేరవేసే అవకాశం ఉంది. ఈ యాప్ ఐఫోన్-6కు కూడా సపోర్ట్ చేస్తుందని, ఐఫోన్-6 వెర్షన్‌లో ఐఒఎస్-8 ఉండటం, ఐఒఎస్-8 సాఫ్ట్‌వేర్‌కు టెలిగ్రామ్ యాప్ సపోర్ట్ చేస్తుండటంతో ఐఫోన్-6 వినియోగదారులకు ఈ యాప్ ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

చాట్ ఆప్షన్స్..

బ్రాడ్‌కాస్ట్: ఈ ఆప్షన్ ద్వారా మొబైల్‌లో 100 కాంటాక్ట్స్‌ను ఒకేసారి ఎంపిక చేసుకుని వారందరికీ ఏకకాలంలో ఎస్ఎంఎస్ పంపే అవకాశం ఉంది. గ్రూప్ ఆప్షన్ కింద 200 మందిని గ్రూప్‌గా క్రియేట్ చేసుకుని ఒకేసారి అందరికీ ఎస్ఎంఎస్ చేయవచ్చు. ముఖ్యంగా గ్రూప్ ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపుకునే అవకాశం వుంది.

గ్రీన్‌చెక్స్ ఆప్షన్: ఈ ఆప్షన్‌లో అవతలి వ్యక్తికి పంపించిన ఎస్ఎంఎస్ సదరు వ్యక్తి చదివాడా లేదా అనేది తెలియజేస్తుంది. గ్రీన్‌చెక్స్‌లో వన్ చెక్స్, 2 చెక్స్ అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. మీరు పంపించిన సమాచారం అవతలి వ్యక్తికి అంది, అది చదవకుండా ఉంటే వన్‌చెక్స్‌గా, పంపించిన సమాచారం అవతలి వ్యక్తికి చేరి ఆ సమాచారాన్ని చదివితే 2 చెక్స్ అని ఇండికేట్ అవుతుంది. వన్‌చెక్స్‌కు రెడ్ ఇండికేట్, 2 చెక్స్ ఆప్షన్‌కు గ్రీన్ ఇండికేట్‌ను టెలిగ్రామ్ సృష్టికర్తలు క్రియేట్ చేశారు.

సీక్రెట్ చాట్: దీని ద్వారా ఎస్ఎంఎస్, ఫొటోలు, వీడియోలు ఇతర ప్రాధాన్యత గల ఫైళ్లను రహస్యంగా పంపుకునే అవకాశం ఉంది. వేరే వ్యక్తికి తెలిసే అవకాశం కానీ, సమాచారం, సీక్రెట్ ఫైల్స్ సర్వర్‌లో కూడా సేవ్ అయ్యే అవకాశంకానీ ఉండదు. తద్వారా చాట్ చేసుకునే వ్యక్తులకు టెలిగ్రామ్ యాప్ పూర్తి స్వేచ్ఛనిస్తుందని చెప్పొచ్చు.

చాట్: ఈ ఆప్షన్ ద్వారా అవతలి వ్యక్తులకు సమాచారం చేరవేయడమే కాకుండా ఫొటోలు పంపడం, చాట్‌లోనే ఫొటోలు తీసి పంపడం, వెబ్‌పేజీలు సెర్చ్ చేసుకోవడం, వీడియోలను ఎంపిక చేసి పంపడం, చాట్ చేసే వ్యక్తి లోకేషన్ తెలుసుకోవడం, డాక్యుమెంట్ అనే ఆప్షన్ ద్వారా డాక్యుమెంట్స్, జిప్‌ఫైల్స్, ఎంపీత్రీ, పీడీఎఫ్, పీపీటీ, ఎక్సెల్, ఎడోబ్, వర్డ్ లాంటి 50 ఎంబీ గల ఫైల్స్‌ను క్షణాల్లో మొబైల్స్, పీసీ, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లకు పంపించే అవకాశం ఉంది.

ఇతర ఫీచర్లు :

* వాట్స్‌యాప్ కన్నా వేగవంతమైనది, తేలికైనది.
* కొంతకాలం తర్వాత కొనుక్కోమని అనదు. ఉచితం మరియు యాడ్స్ గొడవ అసలే ఉండవు.
* వాట్స్‌యాప్ వలే కాకుండా ఎన్ని పరికరాలలో అయినా ఇన్‌స్టాల్ చేసుకొని ఏకకాలంలో వాడుకోవచ్చు.
* ప్రముఖ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌లతో పాటు అన్ని డెస్క్‌టాప్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలో కూడా ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. https://telegram.org/ నుండి ఇన్‌స్టాల్ చేసుకోండి.
* ఇన్‌స్టాల్ చేసుకోకుండా వాడుకోవడానికి వెబ్‌వెర్షన్ కూడా అందుబాటులో ఉంది. https://web.telegram.org/#/login చూడండి.
* భద్రతకి ప్రాధాన్యతనివ్వడంతో పాటు నిర్ణీత సమయంలో చెరిగిపోయేటట్లు రహస్య సందేశాలను పంపుకునే సౌలభ్యం.
* వాట్స్‌యాప్‌ని పోలిన అలవాటయిన ఇంటర్‌పేజ్‌తో వాడడం సులభం.
* 200 సభ్యులతో పెద్ద గ్రూప్ తయారు చెసుకోవచ్చు. గ్రూపులో ఆన్‌లైన్‌లో ఉన్నవారిని సులభంగా గుర్తించవచ్చు.
* 1జిబి పరిమాణం గల ఫైళ్ళను కూడా పంపుకోవచ్చు. వీడియోలు మరియు చిత్రాలే కాకుండా ఎటువంటి ఫైల్ అయినా పంపుకోవచ్చు.
* పూర్తిగా క్లౌడ్ అధారిత సర్వీసు కావడం వలన ఏ పరికరం నుండయినా ఫైళ్ళను తెరవవచ్చు.

ముఖ్యంగా వాట్స్‌యాప్ అనేది క్లోజ్‌డ్ సిస్టం (మొబైల్ నుంచి మొబైల్‌కు సమాచారం చేరవేయడానికి మాత్రమే ఉపయోగపడేది). టెలిగ్రామ్ యాప్ అనేది ఓపెన్ ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్). ఈ సౌకర్యం కారణంగా అత్యధిక కెపాసిటీ గల అన్ని రకాల ఫైల్స్‌ను క్షణాల్లో మొబైల్స్, పీసీ, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లకు పంపించే అవకాశం ఉంది. వాట్స్‌యాప్‌లో ఫైల్స్‌ను మొబైల్స్, పీసీ, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లకు చేరవేసే అవకాశం లేదు. అంతేకాకుండా వాట్స్‌యాప్ వినియోగదార్లకు ఛార్జీ వసూలు చేస్తామని ఫేస్‌బుక్ ఇప్పటికే ప్రకటించింది. ఇది కూడా టెలిగ్రామ్ యాప్ క్రేజ్ పెరగడానికి ఒక కారణంగా వుందని నిపుణుల అభిప్రాయం.

రచయిత సెల్ : 9490099219

సహృదయ విమర్శకుడు

గ్రంథావలోకనం (పీఠికలూ - సమీక్షలు),
ఆచార్య ఎస్వీరామారావు, వెల : 100/-,
పేజీలు : 213, ప్రతులకు : పసిడి ప్రచురణలు
హైదరాబాద్. 9848012053

ప్రాచీన కావ్యాలకు అవతారికలు, నాటకాలకు ప్రస్తావనలు ఉన్నాయి. ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియలకు పీఠికలున్నాయి. గ్రంథాన్ని పాఠకుడు అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే సమాచారాన్ని ఇవ్వడం పీఠికకు ప్రధాన లక్షణం. గ్రంథం తనంత తానుగా ఇవ్వని, పాఠకునికి అవసరమైన, పాఠకుడు తెలుసుకోగోరే వివరాలను పీఠిక అందిస్తుంది. గ్రంథ పఠనానికి పూర్వరంగాన్ని సిద్ధం చేస్తుంది. తెలుగు సాహిత్య విమర్శను పరిపుష్టం చేయడంలో ప్రత్యేక సాహిత్య విమర్శ ప్రక్రియలు ఎంత కృషి చేశాయో, అంత కృషి పీఠికల్లోనూ జరిగింది. అలా బహుముఖంగా వికసించిన తెలుగు సాహిత్య విమర్శలో పీఠికలు కూడా ఒక భాగమేనని నిర్ధారించిన ఆచార్య ఎస్వీరామారావు 1998 నుండి 2013 వరకు రాసిన 90 పీఠికలు, 16 సమీక్షలు, కొన్ని సంగ్రహాభిప్రాయాలను కలిపి 'గ్రంథావలోకనం'గా వెలువరించారు.

పీఠికలలో కవి పరిచయం, కావ్య పరిచయం ఉండటం పరిపాటి. ఇదే మార్గాన్ని అనుసరించిన ఎస్వీరామారావుగారి పీఠికలలో ముందుగా కవి పరిచయం పేరిట ఆ కవితో ఉన్న సన్నిహితత్వం, అతని కృషిని, గొప్పదనాన్ని తెలియజేస్తారు. తర్వాత ఆ కావ్యంలో వున్న విషయాన్ని, ముఖ్యంగా మంచి అంశాలను తీసుకుని విశ్లేషించడం కనిపిస్తుంది. వీరు పీఠికలు రాసిన వాటిలో ఎక్కువగా కవితా సంపుటాలే కనిపిస్తాయి. ప్రాచీన - ఆధునిక అనే భేదం లేకుండా అన్ని కవితా సంపుటాలకు, భక్తి - ఆధ్యాత్మికత గ్రంథాలకు రాసిన పీఠికలు ఎక్కువగా వున్నాయి. సత్యసాయిబాబా, శ్రీ కాశీనాథ బాబా చరిత్రతో పాటు క్రీస్తు దివ్య శతకమునకు కూడా పీఠిక రాయడంలో చూపిన సమదృష్టి, నిష్పక్షపాతం ప్రశంసించదగింది.

ఇవి కాకుండా సిద్ధాంత గ్రంథాలు, సాహిత్య వ్యాస సంపుటాలు, స్థల పురాణాలు, జానపద వాఙ్మయంనకు సంబంధించిన గ్రంథాల పీఠికలు కూడా వున్నాయి. ఇందులో 'విశ్వనాథ నవలలు - మనస్తత్వ చిత్రణ' గ్రంథానికి రాసిన పీఠిక పండిత విమర్శకాగా, 'నౌకాభంగా'నికి రాసిన పీఠిక పాపులర్ విమర్శగా చెప్పుకోవచ్చు. క్లుప్తత, స్పష్టత వీరి పీఠికలలో కనిపించే ప్రధాన లక్షణం. అందుకే వారి పీఠికలు ఒక పేజీ నుండి మూడు పేజీల వరకే పరిమితమవుతాయి. అలాగే సమీక్షలు కానీ, అభిప్రాయాలు కానీ క్లుప్తంగా, సూటిగా వుండి పాఠకులకు ఆ పుస్తకాన్ని పరిచయం చేస్తాయి.

తాము రాసిన ఒక్కొక్క పుస్తకాన్ని ఒక్కో విమర్శకుడిచే రాయించడం చాలా మందికి అలవాటు. కానీ ఒకే రచయిత తాను రాసిన రెండు పుస్తకాలకు, కొంతమంది తమ మూడు పుస్తకాలకు, నాలుగు పుస్తకాలకు కూడా ఎస్వీరామారావు గారితోనే పీఠికలు రాయించడం విశేషమనే చెప్పాలి.

తమ ఆలోచనలను ఎదుటివారి మీద రుద్దాలని కానీ, తమ పాండిత్యాన్ని ప్రదర్శించాలని కానీ, ఎదుటివారి రాతలను ఖండించాని కానీ, అకారణంగా విరుచుకు పడడం కానీ లేకుండా కేవలం పాఠ్యాంశానికే పరిమితమై, అందులోని మంచి అంశాలను హైలెట్ చేసి రచయితలను ప్రోత్సహించే ధోరణి ఈ పీఠికలలో కనిపిస్తుంది. సమాచారాత్మకంగా, విజ్ఞానాత్మకంగా కనిపించే ఈ పీఠికలు విమర్శకుడిగా ఎస్వీరామారావు గారి సహృదయతను తెలియజేస్తాయి.

- కె.పి. అశోక్ కుమార్

ఆర్ద్రమైన కథల సమాహారం

కరుణకుమార కథలు
పేజీలు: 278, వెల: 125.
ప్రతులకు:
విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

తెలుగువారి ప్రేమ్‌చంద్ అని ప్రసిద్ధ కథకులు కరుణకుమార గురించి మధురాంతకం రాజారాం అన్నారు. గ్రామాలలో నివసించే బీదల పాట్ల గురించి ఆర్ద్రమైన రీతిలో కథలు రాశారు కరుణకుమార. నిత్యం శ్రమించే పల్లె ప్రాంతాల్లోని కష్టజీవుల బతుకుల్లోని బహుళ పార్శ్వాల్ని ఆయన దగ్గరగా చూశారు. వాటిని కథనం చేయడంలో తగిన శ్రద్ధ చూపారు. వారి కథలన్నీ ఇప్పుడు 'కరుణకుమార కథలు' పేరిట పుస్తకంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ పుస్తకానికి వారి కుమారుడు కందుకూరి ఉమాశంకరరావు, మధురాంతకం రాజారాం గారి ముందుమాటలు ఉండడం బాగుంది. దీని వల్ల ఈ రచయిత నేపథ్యం ఏమిటో ఈతరం పాఠకులకు తెలుస్తుంది. కరుణకుమార రాసిన కథల్లో పొలయ్య, సేవాధర్మం, జాకీ, కనువిప్పు ఎంతో మెప్పు పొందాయి.

కేవలం గ్రామీణ జీవితంలోని విషాదాన్ని, సమస్యల్ని ఏకరువు పెట్టలేదు. ఆయా పాత్రల, సంఘటనల అంతస్సారంలోకి వెళ్ళి కళాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు కరుణకుమార. అందువల్ల జవజీవాలతో కూడిన నిండుదనం ఈ కథలకు ఉంది. పొలయ్య కథ 1937లో రాశారు. నేటికీ కొత్తదనంతో పాఠకుడిని కదిలిస్తుంది. పాఠకుల్లో అలజడినీ, హృదయ సంవేదననీ రేకెత్తించే భావనా బలం ఉన్న కథల సమాహారం ఈ పుస్తకం.

- వికర్ణుడు

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటి రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500020.

సిలబస్‌లో పెట్టాల్సిన కథలు

సంపంగి (బాలల కథా సంపుటి)
పేజీలు: 112, వెల: రూ. 60.
ప్రతులకు: చొప్ప విశాలాక్షమ్మ, 2-228,
బుక్కరాయ సముద్రం (గ్రామం, పోస్టు),
పిన్‌కోడ్: 515 701
అనంతపురం జిల్లా,
ఫోను: 94924 50984

పిల్లల కోసం కథలు రాయాలన్న ఆసక్తి విద్వాన్ చొప్ప వీరభద్రప్పలో బలీయంగా వుంది. కథలు పిల్లలకు వివేకాన్ని, విజ్ఞానాన్ని ఆచరణాత్మక ప్రయోజనాన్ని కలిగిస్తాయనే అవగాహన వారిది. కనుకనే పిల్లల్లో నైతిక విలువలు ప్రోది చేయాలనే ఆకాంక్షతో కథలు రాస్తున్నారు. గత ఏడాది 'నైతికా కథాదర్శనం' పేరుతో ఒక పుస్తకం తీసుకువచ్చారు. ఇప్పుడు 'సంపంగి' శీర్షికన బాలల కథా సంపుటి వెలువరించారు. ముచ్చటయిన ముఖచిత్రంతో చూడగానే ఆకర్షించే పుస్తకమిది. దీనిలో 18 చిన్న కథలు, నాలుగు పెద్ద కథలు, ఏడు గేయ కథలున్నాయి. ప్రతి కథని ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. కథకు ఉన్న బొమ్మ చూడగానే కథ చదవాలనిపించే రీతిన రూపుదిద్దారు. చిన్నచిన్న వాక్యాలతో పూసగుచ్చినట్టు కథని రాశారు. తేలికయిన పదాల్ని ఉపయోగించారు. సరళమైన వాక్యవిన్యాసం ప్రత్యేక ఆకర్షణ. తలంపు, మాయమాటలు, అపోహ, తీర్పు, సన్మానం, సంపంగి, హృదయరాగం, మూగజీవాలు, ఎంపిక, వెలిగేవాక్యం, సేవాభావం, ప్రబోధం, మాతృప్రేమ వంటి కథలు వస్తుశిల్పాల్లో ప్రత్యేకమైనవి.

పిల్లలకు సుబోధకమయ్యే రీతి శైలిననుసరించి రచయిత వీరభద్రప్ప ఈ కథలు రాశారు. రాసిన పద్ధతి కథలంటే ఇష్టపడేలా వుంది. ఇంటి దగ్గర అమ్మానాన్నలు పిల్లల్ని కూర్చోబెట్టి చదివి వినిపిస్తే సులువుగా ఆకళింపు చేసుకునేలా ఈ కథలున్నాయి. ఇలాంటి రచనాశైలిని అనుసరించినందుకు రచయితను అభినందించాలి. అందుకనే ఈ సంపుటిలోని కథలన్నీ పిల్లల్నీ, పెద్దల్నీ కూడా అలరిస్తాయని ముందుమాటలో సింగమనేని నారాయణ చెప్పిన మాట అక్షరాలా నిజం.

మూడున్నర దశాబ్దాల సాంఘికశాస్త్ర బోధనానుభవం గల వీరభద్రప్ప ఈ కథలలో అనేక ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానికాంశాలను చొప్పించి బాలలకు అర్థమయ్యే భాషలో రాశారని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి చేసిన పరిశీలన బావుంది. పిల్లలకు నైతికపాఠాలు అవసరమని, అందుకు ఈ కథలు ఉపకరిస్తాయని దాసరి వెంకటరమణ చెప్పిన మాటలు ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ కథల్ని పిల్లల తెలుగు సిలబస్‌లో పెట్టడం వల్ల ప్రయోజనం వుంటుంది. పిల్లల ప్రపంచాన్ని ఆవాహన చేసుకున్న రచయిత విద్వాన్ చొప్ప వీరభద్రప్ప. ఇలాంటి కథల సంపుటాలు వారినించి మరిన్ని రావాలి.

మార్క్సిస్టు దృక్పథంతో నెహ్రూపై అంచనా



జవహర్‌లాల్ నెహ్రూ జీవితం - కృషి
రచన: బి.టి.రణదివే,
అనువాదం: వి.ఆర్.బొమ్మారెడ్డి
పేజీలు: 80, వెల: రూ. 50.
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

గత లోక్‌సభ ఎన్నికల సమయాన, ఆ తర్వాత భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గురించి చర్చ నడుస్తోంది. ఆర్థికాభివృద్ధి, రాజకీయ విధివిధానాలకు సంబంధించి ఆయన చేసిన కృషి మీద పలు అంచనాలు, అవగాహనలున్నాయి. ఈ దేశంలో గాంధీ తర్వాత పేరొందిన నేతగా నెహ్రూ ప్రసిద్ధులు. వారి జీవితాన్ని, కృషిని అర్థం చేసుకోవాల్సిన పద్ధతి ఏమిటో బి.టి.రణదివే రచించిన పుస్తకం 'జవహర్‌లాల్ నెహ్రూ జీవితం - కృషి' చదివితే బోధపడుతుంది. ఈ పుస్తకాన్ని రణదివే ఆంగ్లంలో రచించగా వి.ఆర్.బొమ్మారెడ్డిగారు తెలుగులోకి అనువాదం చేశారు. నెహ్రూ శతజయంతి సందర్భంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. మరల తాజాగా ఇటీవల పునర్ముద్రించారు.

సంఘ్ పరివార్ శక్తులు సర్దార్‌పటేల్‌కు నెహ్రూకు పోటీ పెట్టి మాట్లాడే పద్ధతిని ప్రచారం చేశాయి. ఈక్రమాన నెహ్రూ కంట్రిబ్యూషన్‌ను తక్కువ చేయడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. కానీ ఛాందసవాద శక్తుల్ని ఎదుర్కోవడంలో, లౌకిక భావాల్ని ప్రోది చేసి ఆచరణలో అమలు చేయడంలో నెహ్రూ చూపిన పట్టుదల, దృఢవైఖరి విస్మరించలేము. ఈ విషయాన్ని రణదివే రాసిన ఈ పుస్తకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఒక మార్క్సిస్టుగా చరిత్రలో నెహ్రూ పోషించిన పాత్రను అంచనా వేయాలి. జాతీయ విముక్తి పోరాటకాలంలో నెహ్రూ ఎలాంటి భావాలు వ్యక్తం చేశారో, ఏ విలువల కోసం నిలబడ్డారో వివరించారు. అధికారపగ్గాలు చేపట్టాక నెహ్రూ భావాల్లో వచ్చిన మార్పుల తీరును విశ్లేషించారు. కనుక ఈ పుస్తకం చదవడం వల్ల నెహ్రూ మీద నిర్దిష్ట అవగాహన ఏర్పరుచుకోవడం వీలవుతుంది.

- కుమార్

గమనిక

- సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.
- రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.
- పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

■ ఈ వారం కవిత్వం

తవ్వుకోగలిగితే

డా॥ సి. నారాయణరెడ్డి

ఉన్న నిధులన్నీ అయిపోతే
కొత్తవి ఎక్కడి నుంచి తీసుకురావాలని
అనుకోవద్దు.
నిరాశను పక్కకు నెట్టి
అవి ఇంతవరకున్న మేధాక్షేత్రాన్ని
పురులు విప్పిన ఉత్సాహంతో మధిస్తే
సరికొత్త విధులు ఉప్పొంగివస్తాయి,
ఎప్పుడూ వీచే వాయువు
ఒక్కొక్కప్పుడు
నిద్రపోతున్నట్టుగా అనిపిస్తుంటుంది.
బిగబట్టిన శ్వాసలతో ఊదితే
అది తటాలున లేచి
చేతులూపుకుంటూ సాగిపోతుంది.
కొండకొమ్మాల పై నుంచి
నేలపైకి సూటిగా దూకే జలపాతం
అప్పుడప్పుడు
పక్క మార్చినట్టు అగుపిస్తుంది.
చూసే కళ్ళలో
ఆ దృశ్య వైచిత్రితో
ఉల్లాసం పల్లవింపజేయాలని
జలపాతం చేసిన చమత్కార క్రీడ అది.
కొన్ని కొన్ని సార్లు
ఎడారిలో
ఊగుతూ ఊగుతూ సాగిపోయే
ఒంటెల కాలిజాడలు మాత్రమే
కనిపిస్తాయి.
కాలాపుటలు తిరగేసి చూస్తే
ఆ పాద ముద్రల్లో
తలలూపుతూ నిల్చునే ఖర్జూరాలు
చూపులకు కొత్త రుచులూరిస్తూ
నిలుస్తాయి.
తవ్వుకోగలిగిన ఊహాపటిమ ఉంటే
ఎన్నడు చూడని
సన్నివేశాల నిధులెన్నో
ఎదుట ప్రత్యక్షమవుతాయి.

ఆశపువ్వు

కె.విల్సన్ రావు

నా దేహానికి
నేనిపుడు అపరిచితుడ్ని
అది నా మాట విని ఎన్నేళ్ళయిందో!?
దానికి డాలర్లంటే మహామోజు -

యవ్వన కాలమంతా
గడిచినాకయినా
నా దేహం
నాలోకి
పున:ప్రవేశిస్తుందని ఆశగా
నా కన్రెప్పల్ని నా దేహ ప్రవేశ ద్వారానికి
అతికించి రేయింబవళ్ళు
ఎదురు చూపుల సంబరాలు -

***

నన్ను నేను కోల్పోయి ఎన్నేళ్ళయిందో!?
అప్పటినుండి ఇప్పటి వరకు
వెతుకుతూనే వున్నా
అలసట లేని దేహాన్ని
ఆకాశపు వాకిలికి తగిలించి
మణిమయ కాంతుల
జీవితం కోసం...

***



మరణించిన నా దేహానికి
మనిషితనాన్నద్ది
ఆత్మ గౌరవాన్ని మోస్తూ
తిరుగుతూనే ఉన్నా
ఎంత తోడినా తరగని
జ్ఞాపకాల నెలవుల్ని తల్చుకుంటూ -

***

సంపదపై మక్కువను జయించే
రోజు కోసం ఎదురుచూపు
విచ్చుకున్న ఆశ పువ్వును మోసుకుంటూ -

సెల్ : 8985435515

మరో నాలుగు

ప్రపంచంలో అతి పెద్ద బహిరంగ ప్రదర్శనశాల అంటే వెంటనే గుర్తొచ్చేది ఏడు వింతల్లో ఒకటైన రోమ్‌లోని కొలోసియం. అక్కడ ఇదొక్కటే కాదు, ఇలాంటివే మరో నాలుగు వున్నాయి. చూడ్డానికి కొలోసియం ఆకారంలోనే ఉన్న వీటి పేర్లు వెరోనా అరెనా, పులా అరెనా, ఆర్లెస్, అరెనా ఆఫ్ నీమ్స్. వీటిలో 20 నుండి 50 వేల జనాభా వరకు కూర్చునే వీలుంది. ఇప్పటికీ వీటిలో రకరకాల ప్రదర్శనలు, వేడుకలు నిర్వహిస్తున్నారు.



ఉత్తమ యాత్ర

అట్లాంటిక్ సముద్ర మార్గం 8.3 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు అట్లాంటిక్ మహా సముద్రంలో నార్వేజియన్ నగరాల మధ్య వుంది. 20వ శతాబ్దంలో మొదలుపెట్టిన ఈ వంతెన ఎన్నో అవాంతరాలు దాటి 2009లో ప్రారంభమైంది. అదే సంవత్సరం రెండు కోట్లకు పైగా ఈ వంతెన చూడ్డానికి పర్యాటకులు వచ్చారు. దీనిమీద ప్రయాణించడమంటే ప్రపంచంలోనే ఉత్తమ రహదారి యాత్ర అని 'ది గార్డియన్' పత్రిక ప్రకటించింది.